
# డీసీ పీఠం ఎవరిదో..?

సాగు నీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యూయూఏ) ఎన్నికలు ముగిశాయి. మంత్రాలయం నియోజకవర్గంలో రెండు సంఘాలు మినహా జిల్లాలో 121 డబ్ల్యూయూఏలను ఎన్డీయే కూటమికి చెందిన మద్దతుదారులు దక్కించుకున్నారు. రెండో దశ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలకు తెర తీశారు. టీబీపీ ఎల్లెల్సీ పరిధిలో పది డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక మంగళవారం జరగనుంది. ఈ మేరకు కలెక్టర్ పి. రంజిత్‌బాషా, ఎన్నికల నోడల్ అధికారి, జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి. బాలచంద్రారెడ్డి పర్యవేక్షణలో డీసీ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేశారు. అదే క్రమంలో డీసీ అధ్యక్ష పీఠం ఆశావహులు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జిల ఆశీస్సుల కోసం సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష పీఠం దక్కాలంటే డీసీ అధ్యక్ష పదవి దక్కించుకోవాల్సి ఉంది. దీంతో ప్రాజెక్టు కమిటీపై కన్నేసిన ముఖ్య నాయకులు డీసీ అధ్యక్షుడిగా ఎంపికవ్వడమే కాదు.. తమకు అనుకూలమైన డీసీ అధ్యక్షులను ఎంపిక చేసుకోవడానికి రాజకీయ వ్యూహాలకు పదును పెట్టారు.



- నేడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు
- తుంగభద్ర ఎల్లెల్సీ పరిధిలో పది డీసీలు
- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎంపికలో డీసీలే కీలకం
- అధికార పార్టీ నేతల ఆశీస్సులు ఎవరికో..?
- ఉదయం 9 గంటలకు ఎన్నికల ప్రక్రియ షురూ
- ఏర్పాట్లు పూర్తి చేసిన జల వనరుల శాఖ అధికారులు




కోసిగి ఎంపీడీవో కార్యాలయం



కర్నూలు డీసీ-9 ఎన్నికలు జరిగే జలమండలి కార్యాలయం

కర్నూలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ)కు ఈ నెల 11న జిల్లా కలెక్టరు పి. రంజిత్‌బాషా నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. మూడు దశల్లో జరగాల్సిన ఈ ఎన్నికల్లో తొలి దశలో 14న జిల్లాలో 123 సాగునీటి సంఘాల పరిధిలో 1,212 ప్రాదేశిక నియోజకవర్గాల (టీసీ)కు ఎన్నికలు నిర్వహించారు. 1,191 టీసీలకు ఎన్నికలు జరగగా.. ఐదారు టీసీలు మినహా మొత్తం ఏకగ్రీవమయ్యాయి. అదేరోజు సాయంత్రం టీసీ సభ్యులు సమావేశమై డబ్ల్యూయూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. షెడ్యూల్‌లో భాగంగా రెండవ దశలో తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) పరిధిలో పది డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. ఒక డీసీ పరిధిలో 5-6 డబ్ల్యూయూఏలు వస్తాయి. ఆ సంఘాల అధ్యక్షులు సమావేశమై డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎంపీడీఓ కార్యాలయాలు, ఎమ్మిగనూరు ఎల్లెల్సీ సబ్ డివిజన్ కార్యాలయం, కర్నూలు జలమండలిలోని మైనర్ ఇరిగేషన్ ఈఈ కార్యాలయం, కర్నూలు ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రక్రియ ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటలకు ముగుస్తుంది. దాదాపుగా పోటీ లేకుండా ఎన్నికలు డీసీ కమిటీ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేసేందుకు టీడీపీ కూటమి నాయకులు అభ్యర్థులను దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తుంది.

## ఎమ్మెల్యేలు ఆశీస్సులు ఎవరికో..?

- కోడుమూరు నియోజకవర్గం పరిధిలో కోడుమూరు డీసీ-8, కర్నూలు డీసీ-9, కర్నూలు డీసీ-10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. కర్నూలు డీసీ-10 పరిధిలో ఒక్కటే పర్ల, ఉల్చాల, పెద్దపాడు డబ్ల్యూయూఏలు పాణ్యం నియోజకవర్గం పరిధిలోకి వస్తున్నాయి. కోడుమూరు డీసీ-8 అధ్యక్ష పీఠం కోసం గోరంట్ల కున్నూరు చంద్రశేఖర్, గూడూరు సింగనగేరి నాయుడు ఆశిస్తున్నారు. కర్నూలు డీసీ-9 పీఠం కోసం ఆర్.ఖానాపురం మహేశ్వరరెడ్డి, పోలకల్లు డబ్ల్యూయూఏ అధ్యక్షుడు తిమ్మప్ప, కర్నూలు డీసీ-10 అధ్యక్ష స్థానం కోసం కె.నాగులాపురం ఎ.ధర్మారెడ్డి, పర్ల అధ్యక్షురాలు లక్ష్మీదేవి ప్రయత్నాలు చేస్తున్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నవారికే ఈ పదవి దక్కే అవకాశం ఉంది. అయితే ఏకపక్ష నిర్ణయం కాకుండా డీసీ పరిధిలోని డబ్ల్యూయూఏలు కూర్చొని ఏకాభిప్రాయంతో ఒకరిని ఎంపిక చేయాలని, ఆ వ్యక్తికే డీసీ అధ్యక్ష పదవి ఇస్తామని ఎంపిక బాధ్యతను విష్ణువర్ధన్‌రెడ్డి వారికే వదిలేసినట్లు సమాచారం.
- ఎమ్మిగనూరు నియోజకవర్గం పరిధిలో ఎమ్మిగనూరు డీసీ-5 అధ్యక్ష పదవిని హాలహర్వి డబ్ల్యూయూఏ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నదికైరవాడి అధ్యక్షుడు ఇబ్రహీంపురం బోయ కాశీంలు ఆశిస్తున్నారు. ఎమ్మిగనూరు డీసీ-6 పీఠం కోసం గురుజాల డబ్ల్యూయూఏ అధ్యక్షుడు జిలిబిలి అమర్‌నాథ్‌రెడ్డి, కలుగోట్ల నీటి సంఘం అధ్యక్షుడు బోయ నాగేశ్ ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. గోనేగండ్ల డీసీ-7 అధ్యక్ష పీఠం కోసం గోనేగండ్ల డబ్ల్యూయూఏ అధ్యక్షుడు టమోటా హుసేనీ, అల్వాల అధ్యక్షుడు కురవ శ్రీనివాసులు ప్రయత్నాలు చేస్తున్నారు. డీసీ అధ్యక్ష పీఠం వరించాలంటే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆశీస్సులు ఉండాల్సిందే.
- మంత్రాలయం నియోజవకర్గంలో కౌతాళం డీసీ-2 పీఠం కోసం బదినేహాల్ డబ్ల్యూయూఏ అధ్యక్షుడు టిప్పుసుల్తాన్, కోసిగి డీసీ-3 పీఠం కోసం జంపాపురం అధ్యక్షుడు అనంతసేనారెడ్డి, పెద్దకడుబూరు డీసీ-4 అధ్యక్ష స్థానంలో కోసం పెద్దకడుబూరు డబ్ల్యూయూఏ అధ్యక్షుడు నరవ రమాకాంతరెడ్డి పేర్లు దాదాపుగా ఖరారైనట్లు సమాచారం. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి మద్దతు ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఆలూరు నియోజకవర్గంలో ఏకైక హొళగుంద డీసీ-1 అధ్యక్ష పీఠం హొళగుంద డబ్ల్యూయూఏ-4 అధ్యక్షుడు మిక్కిలినేని శివప్రసాద్‌కు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ఆలూరు నియోజవర్గం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ మద్దతు ఇచ్చినట్లు సమాచారం. టీబీపీ ఎల్లెల్సీ పరిధిలో పది డీసీల్లో ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలలోని 8 డబ్ల్యూయూఏలు కలిగిన అతిపెద్ద డీసీ ఇదే.

**టీబీపీ ఎల్లెల్సీ డీసీలు, ఎన్నికలు జరిగే కేంద్రాలు, డీసీ పరిధిలోకి వచ్చే డబ్ల్యూయూఏల వివరాలు**

| డిస్ట్రిబ్యూటరీ కమిటీ | ఎన్నిక కేంద్రం | డబ్ల్యూయూఏలు |
|---|---|---|
| హొళగుంద డీసీ-1 | ఎంపీడీఓ ఆఫీసు, హొళగుంద | జె.హసల్లి, బల్లూరు, హొళగుంద-1, 2, గజ్జెహల్లి, పెద్దహరివాణం, సంతేకూడ్లూరు, రౌడూరు |
| కౌతాళం డీసీ-2 | ఎంపీడీఓ ఆఫీసు, కౌతాళం | బదినేహాల్, కౌతాళం -1, 2, సులేకేరి, కుంబళనూరు, హాల్వి |
| కోసిగి డీసీ-3 | ఎంపీడీఓ ఆఫీసు, కోసిగి | కామన్‌దొడ్డి, సాతనూరు, జంపాపురం, మాధవరం, రచ్చుమర్రి |
| పెద్దకడబూరు డీసీ-4 | ఎంపీడీఓ ఆఫీసు, పెద్దకడుబూరు | పెద్దకడుబూరు -1,2, చిన్నతుంబళం, మాలపల్లి, బూదురు |
| ఎమ్మిగనూరు డీసీ-5 | ఎంపీడీఓ ఆఫీసు, ఎమ్మిగనూరు | హెచ్.మురవని, హాలహర్వి, చెట్నేహల్లి, నందవరం, నదికైరవడి |
| ఎమ్మిగనూరు డీసీ-6 | ఎల్లెల్సీ సబ్ డివిజన్ ఆఫీస్, ఎమ్మిగనూరు | నందవరం, కనకవీడు, గురుజాల, ఎమ్మిగనూరు, కలుగొట్ల |
| గోనెగండ్ల డీసీ-7 | ఎంపీడీఓ ఆఫీసు, గోనెగండ్ల | కలుగొట్ల, మిట్టసోమాపురం, పార్లపల్లి, గోనెగండ్ల, అల్వాల, పెద్దనెలటూరు, సి.బెళగల్ |
| కోడుమూరు డీసీ -8 | ఎంపీడీఓ ఆఫీస్, కోడుమూరు | పులకుర్తి, గూడూరు, గోరంట్ల, లద్దగిరి, బ్రాహ్మణదొడ్డి, |
| కర్నూలు డీసీ-9 | ఇరిగేషన్ ఈఈ ఆఫీసు, కర్నూలు | పోలకల్లు, కొండాపురం, ఆర్ ఖానాపురం, రేమట, సింగవరం |
| కర్నూలు డీసీ-10 | ఆర్డీఓ ఆఫీసు, కర్నూలు | మునగాల, ప్యాలకుర్తి, కె.నాగులాపురం, పర్ల, ఉల్చాల, పెద్దపాడు |



ఎన్నికలకు సామగ్రి సిద్ధం చేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

## పటిష్టమైన పునాదుల మీదే ఉత్తమ ఫలితాలు : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో పునాదులు బలంగా ఉంటేనే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని డీఈవో శ్యామ్యూల్ పాల్ అన్నారు. స్థానిక బీ తాండ్రపాడులోని శ్రీలక్ష్మి శ్రీనివాస కాలేజీలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులు, టెక్నాలజీని ఉపయోగించాలని తెలిపారు. విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణంలో అభ్యాసం జరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ రమేష్, ఏఎంవో డాక్టర్ షేక్ రఫీ, ఏఆర్పీలు, వీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపు కర్నూలుకు వైఎస్ జగన్



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి 18న బుధవారం కర్నూలుకు రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ సంయుక్త కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి కుమార్తె చతుర వివాహానికి వైఎస్ జగన్ వస్తున్నారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో ఎస్‌ఏపీ క్యాంపు మైదానానికి చేరుకుంటారు. అక్కడి అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో బయలుదేరి 11:50 గంటలకు డోన్‌రోడ్‌లోని జీఆర్సీ ఫంక్షన్ హాలులో జరిగే వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం 12:30 గంటలకు ఏపీఎస్పీ చేరుకుని అక్కడి నుంచి బెంగళూరుకు తిరిగివెళ్తారని వైసీపీ నాయకులు తెలిపారు.

## గరుడ వాహనంపై దేవ దేవుడు



గరుడ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు పాతనగరంలో పేట ఆంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 97వ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగు తున్నాయి. సోమవారం వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణో త్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పూజల అనంతరం కల్యాణం, రాత్రి రథోత్సవం ఉంటుం దని ఆలయ ఈఓ పీఎస్ రాధాకృష్ణ, ఆలయ అర్చకులు ముంజీ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు.

## అభివృద్ధి గురించి మాట్లాడాలి

ఎర్రకోటపై ఎమ్మెల్యే బీవీ ఫైర్




వివరాలు 7లో


## మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి పాండురంగారెడ్డి


6


## ఆరోగ్య సిరి ధాన్యాలు

సాగును ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


6


## వక్ఫ్ ఆస్తుల రీసర్వేకు నోటిఫికేషన్

కర్నూలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండల పరిధిలో వక్ఫ్ బోర్డు చెందిన పలు ఆస్తులపై రీ సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. గూడూరు మండలంలో వక్ఫ్ బోర్డుకు సంబంధించి 17 ప్రాంతాల్లో ఆస్తులు ఉన్నాయి. గతంలో సర్వే చేసి స్కెచ్‌లు సిద్ధం చేశారు. ఈ ఆస్తులను పర్యవేక్షిస్తున్న ముతవల్లిలను కూడా విచారించారు. వర్ఫ్ బోర్డుకు చెందిన ఆ ఆస్తులను రెండోసారి సర్వే చేయాలని అభ్యర్థించారు. అందుకు అనుగుణంగా వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులను సర్వే చేసి నోటిఫై చేసి జాబితాను ప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కేటీ హర్షవర్ధన్ నోటిఫికేషన్ జారీ చేశారు.

## విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించండి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ వాడకంలో పొదుపుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజురోజుకూ విద్యుత్ వాడకం అధికమవుతున్న నేపథ్యంలో విద్యుత్ వృథా కాకుండా ఆదా చేసుకోవాలని ఉందన్నారు. విద్యుత్ వినియోగంలో పొదుపు గురించి పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించాలన్నారు.. కళాశాల విద్యార్థులకు వర్క్‌షాపులు నిర్వహించి విద్యుత్ సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలు, ఇతర వినియోగదారులకు రైతులకు విద్యుత్ పొదుపు ఆవశ్యకత, సమర్థవంతంగా వినియోగించుకోవడం గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, డీఈ, ఏఈలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

## ముగిసిన రబీ సాగు

- 1.17 లక్షల హెక్టార్లకుగాను 76,027 హెక్టార్లలో మాత్రమే సాగు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రబీ సాగు వివిధ కారణాల వల్ల తగ్గిపోయింది. సాధారణ సాగు విస్తీర్ణం 1,17,288 హెక్టార్లు కాగా, కేవలం 76,027 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం పంటల సాగు విస్తీర్ణంలో 65 శాతం మాత్రమే సాగైంది. ప్రధానంగా పప్పుశనగ 69,038 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా.. 44,703 హెక్టార్లలో మాత్రమే సాగైంది. కందులు 132 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా.. 20 హెక్టార్లలో, పెసలు 731 హెక్టార్లకు గాను 542 హెక్టార్లలో, వేరుశనగ 15,499 హెక్టార్లకు గాను 6,712 హెక్టార్లలో సాగైంది. పొద్దుతిరుగుడు 376 హెక్టార్లకు గాను 71 హెక్టార్లలో మాత్రమే సాగైంది. ఆముదం 129 హెక్టార్లకు గాను, 13 హెక్టార్లలో, మొత్తంగా నూనె పంటల సాగు 16,081 హెక్టార్లకు గాను 6,796 హెక్టార్లలో సాగైంది. వాము 1,616 హెక్టార్లకు గాను 893 హెక్టార్లు, మిరప 810 హెక్టార్లకు గాను 602 హెక్టార్లు, ఉల్లి 2,350 హెక్టార్లకు గాను 1202 హెక్టార్లు, టమోటా 512 హెక్టార్లకు గాను 54 హెక్టార్లు, ఇతర పంటలు 1,296 హెక్టార్లకు గాను 467 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. మొత్తం ఉద్యాన పంటలు 6,853 హెక్టార్లకు గాను కేవలం 3,223 హెక్టార్లలో, వరి 4,440 హెక్టార్లకు గాను కేవలం 168 హెక్టార్లలో సాగైంది. జొన్న 1,080 హెక్టార్లకు గాను 8,651 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న 6,069 హెక్టార్లకు గాను 4,651 హెక్టార్లలో సాగైంది. కొర్ర 1,242 హెక్టార్లకు గాను 100 హెక్టార్లకే పరిమితమైంది. తృణధాన్యాలు మొత్తం 1,243 హెక్టార్లకు గాను కేవలం 100 హెక్టార్లలో సాగైంది.



పప్పుశనగ పంట

## ఎల్లెల్సీలో తగ్గిన నీరు

- గోనెగండ్ల సెక్షన్‌కు 175 క్యూసెక్కుల నుంచి 135 క్యూసెక్కులకు తగ్గుదల
- గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటి మళ్లింపు నిలిపివేత
- కోడుమూరు సెక్షన్‌కు 100 క్యూసెక్కులు విడుదల
- గోనెగండ్ల పంట కాలువలు, తాగు నీటికి 35 క్యూసెక్కుల నీరు

గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి విడుదలయ్యే నీటిని గత రెండు రోజులుగా తగ్గించి, కర్ణాటక ప్రాంతంలో రైతులకు మరో పంట సాగుకు వాడుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఆంధ్రకు వచ్చే నీటి ప్రవాహం తగ్గినట్లు తెలుస్తోంది. ఆదోని, ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్ల సెక్షన్‌కు గత రెండు రోజుల క్రితం 175 క్యూసెక్కులు విడుదల కాగా రెండు రోజుల నుంచి కేవలం 135 క్యూసెక్కులు మాత్రమే విడుదల అవుతున్నాయి. దీంతో గోనెగండ్ల సెక్షన్ ఇరిగేషన్ అధికారులు కోడుమూరుకు 100 క్యూసెక్కులు విడుదల చేసి మిగిలిన 35 క్యూసెక్కులను గోనెగండ్ల సెక్షన్‌లోని పంట కాలువలకు, తాగునీటి పథకాలకు విడుదల చేసుకుంటున్నారు. నీటి మట్టం పడిపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టుకు ఎల్లెల్సీ నీరు మళ్లించే ఇరిగేషన్ అధికారులు నిలిపి వేశారు. దీంతో గాజులదిన్నె ప్రాజెక్టులో ప్రస్తుతం 2.2 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఎల్లెల్సీ నీరు జీడీపీలో నిలువ ఉంచితేనే వచ్చే వేసవిలో తాగునీటి పథకాలకు నీరు అందుతుంది. లేకపోతే వచ్చే వేసవిలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న బండగట్టు, డోన్, క్రిష్టగిరి, కోడుమూరు, కర్నూలు, గూడురు, బెళగల్ ప్రాంతాల నీటి పథకాలకు ఇబ్బందులు తప్పవు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఈ ఏడాది 14000 ఎకరాలు సాగు అవుతుంది. ప్రాజెక్టులో ఉన్న నీరు పంట పొలాలకు సరిపోతే ఇక తాగునీటి పథకాలకు ఇబ్బందులు తప్పవని పరిశీలకులు భావిస్తున్నారు.



గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీలో తగ్గిన నీరు

## అర్జీలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను తప్పనిసరిగా ఆన్‌లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ జిల్లా స్థాయి, మండల స్థాయిలో వచ్చే అర్జీలు అన్నీ ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులు కూర్చొని అర్జీలు రాసుకోవడానికి వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రీఓపెన్ కేసులు పత్తికొండ ఆర్డీవోకు సంబంధించి 6, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే పత్తికొండకు సంబంధించి 4, కర్నూలు ఆర్డీవోకు సంబందించి 3, డీపీవోకు సంబంధించినవి 2 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి 7 పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని త్వరితగతిన వెరిఫై చేసి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సిరి ధాన్యాలు

- 1500 ఎకరాల్లో కొర్ర, రాగులు, సజ్జ, జొన్న పంటలు
- పెట్టుబడి తక్కువ...ఆదాయం ఎక్కువ
- సాగును ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



సాగు చేసిన జొన్న పంట

గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): **సిరి ధాన్యాల సాగుపై రైతన్నలు మక్కువ చూపుతున్నారు. కొర్ర, సజ్జ, రాగులు, జొన్న పంటలను అంతర్ పంటలుగా రైతులు సాగు చేస్తున్నారు. పల్లెలు, పట్టణాలలో ఎక్కువ మంది జనం సిరి ధాన్యాలనే ఆహారంగా వాడుతుండటంతో వాటికి మంచి గిరాకీ పెరిగింది. వైద్యులు సైతం చిరుధాన్యాలను తినమని చెబుతుండడంతో ఈ పంటలకు మరింత డిమాండ్ పెరిగింది.**

### సిరి ధాన్యాల సాగు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో రైతులు అంతర్ పంటలుగా చిరు ధాన్యాలను సాగు చేశారు. కొర్ర నియోజకవర్గంలో 1216 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా 500 ఎకరాల్లో సాగు అయింది. సజ్జ, జొన్న, రాగులు మరో వెయ్యి ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

### పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ:

చిరు ధాన్యాల సాగుకు పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఈ పంటలను అంతర్ పంటలుగా సాగు చేస్తారు. ఈ పంట క్వింటం ధర రూ. 8వేల నుంచి రూ. 12వేల వరకు పలుకుతుంది. పశువులకు మేత కూడా వస్తుంది. దీంతోతో పాడి పశువుల రైతులకు గ్రాసం భారం తగ్గుతుంది. పాడి పెరుగుతుంది. గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె, కులుమాల, పెద్దనేలటూరు, చిన్నమరివీడు, చిన్ననేలటూరు, తిప్పనూరు, వేముగోడు, ఎర్రబాడు, హెచ్ కైరవాడి, నందవరం మండలంలో గురుజాల, ముగతి, నందవరం, మిట్టసోమాపురం, పూలచింత, సోమలగూడురు, నది కైరవాడి, ఎమ్మిగనూరు మండలంలోని 10 గ్రామాల్లో ఈ పంటలు అధికంగా సాగు చేశారు.



సాగు చేసిన కొర్రపంట

### కొర్ర వర్షాధార పంట

కొర్ర పంట వంద రోజుల్లో పంట చేతికి అందుతేంది. ఎకరాకు 10 నుంచి 12 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. అన్ని పంటల్లా కొర్ర పంటకు నీటి అవసరం పెద్దగా ఉండదు, కేవలం వర్షంపై ఆధారపడి పంట పండించవచ్చు. ఎటువంటి పిచికారి మందులు, ఎరువులు అవసరం లేకున్నా భూమిలోని సారాన్ని బట్టి మంచి దిగుబడి సాధించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.



సాగు చేసిన సజ్జ పంట

### సజ్జ, కొర్ర సాగు చేశా

నేను రెండు ఎకరాల్లో సజ్జ, కొర్ర పంటలు సాగు చేశాను. ప్రతి ఏడాది సజ్జ, కొర్రను సాగు చేస్తాను. ఈ పంటకు మంచి గిరాకీ ఉంది. మార్కెట్‌లో ఎప్పుడైన ధర పలుకుతుంది. ఆరోగ్యానికి అవసరమని చాలా మంది ఇంటి దగ్గరకే వచ్చి పండిన కొర్ర, సజ్జలను విడిగా కొనుక్కొని వెళతారు. పెట్టుబడి కూడా పెద్దగా ఉండదు. మంచి లాభాలు వస్తాయి. ఇటీవల ఈ పంటలకు మంచి ప్రచారం వస్తుంది.

మాబు రైతు గోనెగండ్ల

### సిరి ధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి

గతంలో సిరి ధాన్యాలు పంటల గురించి రైతులకు ఎంత చెప్పినా పట్టించుకోలేదు. ఆరోగ్యరీత్య సిరి ధాన్యాలరే మంచి గిరాకీ ఉంది. ఇప్పుడిప్పుడే సిరి ధాన్యాలను సాగు చేసేందుకు రైతుల ఆసక్తి చూపుతున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అధికంగా అంతర్ పంటలుగా సాగు చేస్తున్నారు.



-మహమ్మద్ ఖాద్రీ ఏడీఏ ఎమ్మిగనూరు

## అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం

**కర్నూలు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం అసోసియేషన్ రాష్ట్ర స్థాయి నూతన కార్యవర్గం ఎంపికైంది. సోమవారం నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయి కార్యకవర్గం కోసం పలు ప్రాంతాల నుంచి అధ్యాపకులు తరలి వచ్చారు. రాష్ట్ర కోశాధికారిగా డాక్టర్ జీ ఎల్లప్ప, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా డాక్టర్ కే బాలసుబ్రమణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా జీసీటీఏ అధ్యక్షుడిగా డాక్టర్ డి నాగన్న, కార్యదర్శిగా డాక్టర్ దళవాయి శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

## ఢిల్లీ పరేడ్‌కు సెయింట్ జోసెఫ్స్ విద్యార్థి



విద్యార్థిని అభినందింస్తున్న ఆర్‌యూ అధికారులు

**కర్నూలు అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** దేశ రాజధాని డిల్లీలో జనవరి 26న నిర్వహించే రిపబ్లిక్ పరేడ్‌కు కర్నూలు సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి, ఎన్ ఎస్‌ఎస్ వలంటీర్ హర్ష వర్ధన్ ఎంపికయ్యారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నాగరాజు విద్యార్థిని అభినందించారు.

## ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు బీ. క్యాంపు ప్రభుత్వ ఒకేష నల్ జూనియర్ కళా శాలలో పని చేస్తున్న ప్రిన్సి పాల్ డా.ఎస్. నాగ స్వామి నాయక్ విశ్వేశ్వర య్యా జాతీయ ఉత్తమ ఇంజనీర్ అవార్డు-2024ను అందుకున్నారు. రాష్ట్రంలోని భీమా ప్రాజెక్టు, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయల్ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను విశ్వేశ్వరయ్య జాతీయ ఉత్తమ ఇంజనీర్ అవార్డుకు ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఎంపికయ్యారు. ఈ నెల 15న ఢిల్లీలోని లోధీ రోడ్డులోని ఆంధ్ర అసోసియేషన్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో కార్యక్రమంలో అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

## రేపు పుస్తకావిష్కరణ సభ

**కర్నూలు కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** కర్నూలుకు చెందిన ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ రాసిన 'అజీజ్ కథలు' (కథల సంపుటి) పుస్తకావిష్కరణ సభ బుధవారం సాయంత్రం 3 గంటలకు నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల సమావేశ హాలులో ఏర్పాటు చేసినట్లు కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, గౌరవ అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ ప్రసాదరెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య హాజరవుతారని తెలిపారు. అధ్యాపకురాలు డాక్టర్ వింధ్యావాసినీ దేవి, వక్తలుగా అధ్యాపకురాలు డాక్టర్ ఫామీదా బేగం, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి పుస్తక పరిచయం చేస్తారని, అధ్యాపకురాలు జయలక్ష్మి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని ప్రిన్సిపాల్ పేర్కొ న్నారు.

# కర్ణాటక విద్యార్థినుల కష్టాలు

- ఆదోనిలో విహార యాత్ర బస్సు సీజ్
- ఏడు గంటలపాటు నడి రోడ్డుపై అవస్థలు
- కర్ణాటక ప్రభుత్వం జోక్యంతో సమస్య పరిష్కారం

**విహారయాత్రను హ్యాపీగా ఎంజాయ్ చేద్దామని వచ్చిన ఆ విద్యార్థినులకు నిరాశే మిగిలింది. టూరిస్ట్ పర్మిట్ లేదన్న కారణంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ బస్సును ఆదోని ఎంవీఐ అధికారులు సీజ్ చేశారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు 20 మంది విద్యార్థినులు నడిరోడ్డుపై ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి పదిగంటల సమయంలోనూ విద్యార్థినులు చలికి వణుకుతూ ఇబ్బందులు పడ్డ సంఘటన సోమవారం ఆదోని మండలం పెద్దతుంబళంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.**

**ఆదోని రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా చెన్నరాయ పట్నం తాలుక బిద్రే గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో 8,9,10 తరగతులు చదువుతున్న 20 మంది విద్యార్థినులు, నలుగురు ఉపాధ్యాయులు విహారయాత్రకు కేఏ 44ఏ0198 నంబర్ గల బస్సులో బయల్దేరారు. నాలుగురోజుల పర్యటనలో భాగంగా వారు రెండోరోజు సోమవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం హంపీకి బయల్దేరారు. అయితే మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆదోని



విద్యార్థినులు ప్రయాణిస్తున్న కర్ణాటక బస్సు



పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ బయట చలికి వణుకుతూ కూర్చున్న విద్యార్థినులు

మోటారువెహికల్ అధికారులు బస్సును అడ్డుకుని నిలిపివేశారు. సరైన రికార్డులు, పర్మిట్ లేదని బస్సుకు రూ.80వేలు జరిమాన విధించి బస్‌ను సీజ్ చేశారు. దీంతో బస్సులో ఉన్న విద్యార్థినులు మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు అలా పోలీస్‌స్టేషన్ సమీపంలోని రోడ్డుపైనే ఉండిపోయారు. రాత్రికి విద్యార్థినులు అక్కడే స్టవ్‌పై వంట చేసుకున్నారు. చివరకు కర్ణాటర రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకోవడంతో విద్యార్థినులు అదే బస్సులో రాత్రి 10:30 గంటలకు బయల్దేరారు. ఈ విషయంపై పెద్దతుంబళం ఎస్‌ఐను వివరణ కోరగా విద్యార్థినుల టూరిస్ట్ బస్‌ను అధికారులు సీజ్ చేసి తమ స్టేషన్ ఆవరణంలో ఉంచారన్నారు. ఎంవీఐ దీప్తిని వివరణ కోరగా అసిస్టెంట్ ఎంవీఐ అభీష్ బస్సును సీజ్ చేశారని తెలిపారు. విద్యార్థులు అక్కడే ఉన్నారన్న విషయం తమకు తెలియదని తెలిపారు.

## మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

- జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి పాండురంగారెడ్డి

**కర్నూల లీగల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల అభివృద్ధి చెందుతున్న మధ్యవర్తిత్వంతో కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం ప్రారంభమైన మధ్యవర్తిత్వంపై ప్రత్యేక సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హైకోర్టులో, జిల్లా కోర్టులలో మధ్యవర్తిత్వ వ్యవస్థను ప్రవేశ పెట్టాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ మేరకు 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మధ్యవర్తిత్వాన్ని కక్షిదారుల మధ్య ఎలా నిర్వహించాలనే అంశంపై పలువురు న్యాయవాదులకు అవగాహన




ప్రసంగిస్తున్న పాండురంగారెడ్డి

కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉమ్మడి జిల్లా నుంచి న్యాయవాదులు పాల్గొన్నారు.

## రగ్బీ చాంపియన్స్ కర్నూలు, అనంతపురం జట్లు

- ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

**కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల రగ్బీ పోటీల్లో కర్నూలు, అనంతపురం జట్లు చాంపియన్లుగా నిలిచాయి. సోమవారం సాయంత్రం ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ క్యారెక్టర్ క్రీడాకారులు ముఖ్యమని, అది క్రీడారంగంలోనే అలవడుతుందన్నారు. గెలుపు ఓటములు ప్రధానం కాదని పోటీల్లో పాల్గొనడమే ముఖ్య అంశమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, డా. రంజాన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల వ్యవస్థాపకురాలు స్వర్ణలతాదేవి, కరస్పాండెంట్ మేరీ, ప్రిన్సిపాల్



ట్రోఫీలు అందుకుంటున్న విజేతలు

సుదర్శన్, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి డేనియల్, కోశాధికారి ప్రకాష్, పీడీ జ్యోత్స్న పాల్గొన్నారు.

## 200 చిత్రాల్లో నటించా

- వెయ్యి సీరియళ్లు పూర్తి చేశా
- రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న బెంగళూరు పద్మ



మధ్వమార్గ్ కారిడార్‌లో భర్తతో బెంగళూరు పద్మ

**మంత్రాలయం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** సినీ పరిశ్రమలో 45 ఏళ్లుగా వెయ్యి సీరియల్స్, దాదాపు 200 సినిమాల్లో సహాయ, అతిథి పాత్రల్లో నటించానని నటి బెంగళూరు పద్మ అన్నారు. సోమవారం సాయంత్రం రాఘవేంద్రస్వామి దర్శనార్థం తన భర్తతో కలిసి రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రథోత్సవ సేవలో పాల్గొని ప్రదక్షిణలు చేసి పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సురేష్ ప్రొడక్షన్‌లో చాలా చిత్రాల్లో నటించి రాష్ట్ర అవార్డులు అందుకున్నామని అన్నారు. ప్రేమ ఎంత మధురం సీరియల్‌ను ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తున్నారని తెలిపారు. చాలా చిత్రాల్లో మంచి గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు.

## 19న పది పరీక్షలపై సమావేశం

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఈ నెల 19న ఉదయం 9 గంటలకు పది పబ్లిక్ పరీక్షలపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్, ఏపీఆర్ఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ఏపీఎంజేపీ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పక పాల్గొనాలని ఆదేశించారు.

## జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించండి

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గుడ్ గవర్నెన్స్ వీక్- గ్రామాల వైపు పరిపాలన (ప్రశాసన్ గావోం కి ఓర్) జాతీయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు సుపరిపాలన ప్రాక్టీసెస్, ఇన్షియేటివ్స్ అంశంపై జిల్లా స్థాయిలో వర్క్ షాపు నిర్వహించాలన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతులకు సునయన ఆడిటోరియం పక్కన ఒక ర్యాంప్, కలెక్టరేట్ ఎంట్రెన్స్ వద్ద ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే విభిన్న ప్రతిభావంతులు, అర్జీదారులు సునయన ఆడిటోరియంలో కూర్చునేందు కు గల సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. అర్జీదారులు కూర్చోవడా నికి కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ అంశాలలో అనుభవజ్ఞుడైన ఒక డిటీని అర్జీల రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద, పర్యవేక్షణ కోసం కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించాలని డీఆర్వోను ఆదేశించారు. అర్జీదారుల కోసం ఒక ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్ ఆవరణంలోని అన్న క్యాంటీన్ వద్ద నిరుప యోగంగా ఉన్న స్థలంలో సులబ్ కాంప్లెక్స్ కోసం ప్రతిపాదించిన స్థలా న్ని పరిశీలించారు. అనంతరం ఆర్వో వాటర్ ప్లాంటు వెనుక ఉన్న స్థలా న్ని మున్సిపల్ కమిషనర్‌తోపాటు మాట్లాడి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ఎదురుగా జాతీయ చిహ్నం (నాలుగు సింహాల) గుర్తు చుట్టూ ఉన్న స్థలంలో పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేయా లని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

## మహిళ ఆత్మహత్య

**బనగానపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల గ్రామానికి చెందిన ఓబులేసు కుమార్తె అరుణ కుమారి (25) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం జరిగింది. అరుణకుమారికి మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన ఆల్వకొండ ప్రసాద్ అనే వ్యక్తితో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు ఉంది. గత సంవత్సరం నుంచి కడుపునొప్పితో బాధ పడుతున్న అరుణకుమారి మూడు రోజుల కిందట రామతీర్థం నుంచి పుట్టిల్లు జిల్లెళ్ల గ్రామానికి వచ్చింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అరుణకుమారి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతురాలి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న అరుణకుమారి

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గంగవరం గ్రామంలో చాకలి నరసింహ (37) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. గ్రామంలోని తన పొలం వద్దకు వెళ్తుండగా విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న తీగ తగిలి, అందులో కరెంట్ ప్రవహించడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వీఆర్వో..

**మద్దికెర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బురుజుల గ్రామం వద్ద హోసూరు వంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్వో కేటీ శ్రీనివాసులు (37) సోమవారం సాయంత్రం మృతి చెందాడు. తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన వీఆర్వో కేటీ శ్రీనివాసులు తుగ్గలి మండలం రామకొండ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధుల నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై పత్తికొండ నుంచి గుంతకల్లు వెళ్తున్నాడు. బురుజుల గ్రామం వద్ద హోసూరు వంక వద్ద గుంత లోతుగా ఉండటాన్ని గమనించలేదు. దీంతో అదుపు తప్పి వీఆర్వో శ్రీనివాసులు ఎగిరిపడ్డాడు. వంక ప్రహరీకి తగిలి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని చూసిన ప్రజలు గుమికూడి పాన్‌కార్డు ద్వారా వివరాలు సేకరించారు. మృతునికి భార్య కళావతి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్ఐ విజయకుమార్ నాయక్ కేసు నమోదు చేశారు.


శ్రీనివాసులు (ఫైల్)

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

- వ్యక్తికి తీవ్ర గాయాలు

**బేతంచెర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ మోటారు సైకిల్‌పై బేతంచెర్ల వస్తుండగా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. గాయపడిన వ్యక్తిని బేతంచెర్ల శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మోటరు సైకిళ్ల దొంగలు అరెస్టు


రికవరీ చేసిన బైకులను చూపుతున్న రూరల్ పోలీసులు

**డోన్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** డోన్ మండలం కొట్లవారిపల్లె గ్రామ సర్కిల్ రోడ్డులో రూరల్ పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి ఆరు మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు రూరల్ సీఐ రాకేష్‌బాబు తెలిపారు. నంద్యాల శిల్పానగర్‌కు చెందిన నిందితులు పసుపుల దినేష్, నూతనపేటకు చెందిన షేక్ మహబూబ్ బాషాలను అరెస్టు చేసి వారు దొంగిలించిన 6 మోటారు బైకులను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ బైకుల విలువ రూ.7.10 లక్షలు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో రూరల్ ఎస్ఐ మమత, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

- పెద్దాసుపత్రిలో డీవైఎఫ్ఐ, ఐద్వా ధర్నా



ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ, ఐద్వా నాయకులు

**కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎక్కడికక్కడ సమస్యలు తిష్ట వేశాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం పరిపాలన విభాగం ఎదుట డీవైఎఫ్ఐ, ఐద్వా ధర్నా చేపట్టాయి. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, రాఘవేంద్ర, ఐద్వా జిల్లా నాయకురాలు శ్యామలమ్మ మాట్లాడుతూ హాస్పిటల్‌లో చాలా రకాల మందులు అందుబాటులో లేవని విమర్శించారు. టెస్టులు ప్రైవేటు ల్యాబ్ యాజమాన్యాలతో కుమ్మక్కై కొందరు బయటకు పంపి పేద రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్స్‌రే, ఈసీజీ మిషన్లు తక్కువగా ఉండటం వల్ల రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డా.వై. వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

## చికిత్స పొందుతూ యువ రైతు మృతి

**గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన కౌలు రైతు ఈడిగ విజయ్(21) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నాలుగేళ్లుగా ఉల్లి, కొత్తి మీర తదితర పంటలను సాగు చేసేవాడు. ప్రతిసారి నష్టం రావంతో రూ. 4 లక్షలు అప్పులయ్యాయి. అప్పులు ఇచ్చిన వారు అసలు, వడ్డీ కట్టాలని ఒత్తిడి చేశారు. దీంతో అప్పులు ఎలా కట్టాలని ప్రతి రోజూ తన తల్లి ఈడిగ సుజాత దగ్గర బాధపడేవాడు. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో ఉల్లి, కొత్తిమీర సాగు చేశాడు. కొత్తిమీర ధర పడిపోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనో వేదనకు గురై గత గురువారం ఉదయం కొత్తిమీర పొలానికి వెళ్లి పురుగు మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుం టుండగా వరుసకు సోదరుడైన వినోద్‌గౌడ్ గమనించి కోడుమూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలిచారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.


ఈడిగ విజయ్ (ఫైల్)

# అభివృద్ధి గురించి మాట్లాడాలి

- మీసాలు, గడ్డాల గురించి కాదు
- మాజీ ఎమ్మెల్యేపై ఎమ్మెల్యే బీవీ ఫైర్

**ఎమ్మిగనూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మీసాలు.. గడ్డాలు గురించి కాకుండా నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ వైసీపీ నాయకులు అనుకుంటే టీడీపీ నాయకులు పట్టణంలో తిరగగలరా అని అన్నారని, మరి నేడు పట్టణంలో నడుచుకుంటూ ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నామన్నారు. మీసాలు.. గడ్డాలు గురించి మాట్లాడుతున్నారని, సీనియర్ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి కూడా మీసాలు లేవన్నారు. ఐదేళ్లగా మీరు అధికారంలో ఉండి వేయలేని రోడ్డును మీసాలు లేని జయనాగేశ్వరరెడ్డి వేశారని తెలిపారు. అంతేగాక వైసీపీ ప్రభుత్వంలో జీఆర్‌పీ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్తే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1.20 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన జీడీపీ పైపులైన్‌ను తిరిగి పునరుద్ధరించడంతోపాటు వైసీపీ వారికి పట్టాలు ఇచ్చిన స్థలంలోనే తిరిగి టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఒక ముస్లిం మైనార్టీ పోలీసు అధికారిని ఇష్టం వచ్చినట్లు దూషించి సీఐ మాట్లాడింది మాత్రమే రికార్డు చేసి క్షమాపణలు చెప్పాలంటున్నారని విమర్శించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

శివన్న నగర్‌లో తన తండ్రి ఇచ్చిన పట్టాలపై కోర్టులో ఆర్డర్ ఉన్నా అప్పట్లో పోలీసులను అడ్డుపెట్టుకొని గుడిసెలను ధ్వంసం చేశారని గుర్తుచేశారు. నాడు పోలీసులు మంచి వాళ్లు.. నేడు చెడ్డవాళ్లా అని ప్రశ్నించారు. వైపు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించినట్లు ప్రకటించారని, మరీ చెన్నకేశవరెడ్డి పార్లపల్లికి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. 42 ఏళ్లుగా కాలువ కింద ఉన్న ఇతర రైతులను కాదని చెన్నకేశవరెడ్డి పొలాలకు సాగునీరు పారించుకున్నారని ఆరోపించారు. ఇక నుంచి అవి చెల్లవని ఎర్రకోట, గువ్వలదొడ్డి, పార్లపల్లి, తిమ్మాపురంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రతి రైతు పొలాలకు సాగు నీరు అందిస్తామన్నారు. మీలాగా అధికారంలో ఉన్నప్పుడు కూతురు, అల్లుడు, కొడు కుకు పదవులు కట్టబెట్టలేదన్నారు. అభివృద్ధిలో పోటీ పడదాంగాని రెచ్చగొట్టే మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు. జనసేన ఇన్‌చార్జి రేఖాగౌడ్, బీజేపీ నాయకులు నరసింహులు, టీడీపీ నాయకులు విరుపాక్షిరెడ్డి, చెన్నారెడ్డి, సూర్య నారాయణరెడ్డి, పార్లపల్లి మల్లికార్జున, చంద్రారెడ్డి, రైస్‌మిల్ నారా యణరెడ్డి, వెంకట్రామి రెడ్డి, సురేష్ చౌదరి, తురేగల్ నజీర్, చెన్నాపురం నాగరాజు, రాఘవేంద్ర, జగదీష్, ఎన్వీ రామాంజ నేయులు, నాగరాజు, అల్తాఫ్, జహంగీర్ పాల్గొన్నారు.

## విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

**కర్నూలు క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి వారి సమస్యలు విని వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి.

- ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డు అమౌంట్ పెంచుతామని ఫోన్ చేసి ఆర్‌బీఎల్ క్రెడిట్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పి తన క్రెడిట్ కార్డు నుంచి రూ.80 వేలు తీసు కున్నారని కల్లూరు మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన సూదేపల్లె సురేష్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు నుంచి పత్తి పనికి 30 మంది వలస కూలీలం వెళ్లామని, అక్కడ పని చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల మండలం, పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన రవి ఫిర్యాదు చేశారు.
- తమ గుడిసెను ఆక్రమించుకోవాలని తనను, బిడ్డను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జోహరాపురం చెందిన దివ్యాంగురాలు లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు
- వరి పంట నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకొని నష్టపరిహారం ఇప్పించాలని కర్నూలు మండలం జి.సింగవరం గ్రామానికి చెందిన లోకేశ్‌గౌడు ఫిర్యాదు చేశారు.
- బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పందిపాడుకు చెందిన సాయికిరణ్ రూ.3.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని పసుపుల గ్రామానికి చెందిన సాయికిరణ్ ఫిర్యాదు చేశారు.
- ఆస్తి పంపకాలు కాకుండా కుమారుడు లోకేశ్ శర్మ ఇబ్బందులకు చేస్తున్నాడని కర్నూలు గీతాంజలి హోమ్స్‌కు చెందిన గోవిందమ్మ ఫిర్యాదు చేశారు.
- బెంగుళూరు ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో జాబ్ ఇప్పిస్తామని చెప్పి చరణ్‌రెడ్డి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పరిచయమై రూ.40వేలుతీసుకుని మోసం చేశాడని కర్నూలు వడ్డేగేరికి చెందిన ఆసీఫ్‌బాషా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ జి. బిందుమాధవ్ హామీ ఇచ్చారు.

## మరింత తగ్గిన ఉల్లి ధర

- క్వింటం గరిష్ఠంగా రూ.3,149లు
- కొనసాగుతున్న మహారాష్ట్ర ఉల్లి ఎఫెక్ట్

**కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మహారాష్ట్ర నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు, పరిసర ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఉల్లిగడ్డలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కర్నూలు జిల్లా ఉల్లికి డిమాండ్ తగ్గిపోతోంది. శనివారం క్వింటం ఉల్లి రూ.3,600కు గరిష్ఠ ధర రైతులకు లభించగా.. సోమవారం మరింత దిగజారింది. కేవలం క్వింటం ఉల్లి గరిష్ఠ ధర రూ.3,149, మధ్యస్థ ధర రూ.2,259, కనిష్ఠ ధర రూ.615కు తగ్గిపోవడంతో ఉల్లి రైతులు ఆవేదన చెందుతున్నారు. అదే విధంగా కందులు గత శనివారం రూ.9,999 గరిష్ఠ ధర నమోదు కాగా, సోమవారం ఏకంగా రూ.1000 తగ్గిపోయింది. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 1,987 క్వింటాళ్ల కందులు రావడంతో వ్యాపారులు అమాంతం ధరను తగ్గించేశారు. మొక్కజొన్న ధరలు కూడా తగ్గిపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన రూ.2,250 కంటే రూ.100 తక్కువైంది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,309, మధ్యస్థ ధర, కనిష్ఠ ధరలు కేవలం రూ.2,109 నమోదయ్యాయి. ఎండు మిరప కాయల ధర పూర్తిగా తగ్గిపోయింది. గత సంవత్సరం ఇదే సమయానికి క్వింటం ఎండుమిర్చి రూ.30 వేలపైనే ఉండగా.. సోమవారం గరిష్ఠ ధర రూ.15,499 మాత్రమే రైతుకు దక్కింది. మధ్యస్థ ధర రూ.14,299, కనిష్ఠ ధర రూ.2,349 దక్కింది. మినుములకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధరలు రూ.8,287 దక్కింది. సజ్జలకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధర క్వింటానికి రూ.2,291 పలికింది. కొర్రలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.2,531, కనిష్ఠ ధర రూ.1,609 లభించింది. వేరుశనగకాయలకు గరిష్ఠ ధర రూ.6,799, మధ్యస్థ ధర రూ. 5,120, కనిష్ఠం రూ.4,069 మాత్రమే దక్కింది.


కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లి

## చిన్న కుమారుడి నుంచి కాపాడండి

- సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించిన సీనియర్ సిటిజన్

**ఆదోని, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** ఆస్తి విషయంలో తన చిన్న కుమారుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని సీనియర్ సిటిజన్ స్వామినాథన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు విన్నవించుకున్నారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు న్యాయవాది చంద్రయ్యతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామినాథన్ విలేఖర్లతో మాటాడారు. ఆదోనిలో మొట్ట మొదటిగా క్లాస్‌వన్ కాంట్రక్టర్‌గా పని చేశానని, కుటుంబం కోసం కొంత ఆస్తిని కూడబెట్టా న్నారు. ప్రస్తుతం తాను పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ ఏజీ రోడ్డులో నివాసం ఉంటున్నానని తెలిపారు. తనకు భార్య సరోజమ్మతోపాటు పద్మావతి, రాధ, రవికుమార్, రమేష్ సనీలా సంతా నమని చెప్పారు. ఎంటెక్ వరకు చదివిన రమేష్ సనీలాకు అతను కోరుకున్న కోయంబత్తూర్ అమ్మా యి కల్పనతో 16 ఏళ్ల క్రితం వివాహం జరిపించామన్నారు. ప్రస్తుతం తన కూమా రుడు రమేష్ సనీలా భార్య కల్పనతో పాటు కోయంబత్తూరు లోనే నివాసం ఉంటున్నారని తెలిపారు. అక్కడ కూడా రమేష్ సనీలా పని చేయకుండా జల్సాగా తిరుగుతూ ఖాళీగానే ఉంటు న్నాడని చెప్పారు. కోడలు కల్పన ఆమె తండ్రి గాంధీ కలిసి కోయంబత్తూర్ పోలీస్ స్టైషన్‌లో తనపై వేధింపుల తోపాటు పరువు నష్టం దావా కేసు పెట్టారని కన్నీటి పర్యంతమయ్యాడు. అక్కడ పోలీసులు ద్వారా తనకు వారెంట్ కూడా ఇప్పించాడని, నడవలేక ఇబ్బందులు పడుతుంటే ఇలా చేస్తున్నాడని కన్నీరు కార్చారు. ఈ నేపథ్యంలో భార్య సరోజమ్మతో కుమ్మక్కై ఆస్తి ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. 2020లో కలిసి ఉన్నప్పుడు టీలో తనకు విషం ఇచ్చి చంపాలని చూశాడని, వారం రోజులపాటు అపస్మారక స్థితిలోకి వెళ్లానని, అ సమయంలో తనకు పెద్ద కుమారుడైనా రవికుమార్ పెద్ద కోడలు అనురాధలు ఆసుపత్రిలో చికిత్స చేయించారన్నారు. తన పెద్ద కూమారుడిపై కూడా కేసులు పెట్టి ఇబ్బందులుకు గురి చేస్తున్నారని తెలిపారు. తన కష్టార్జితంతో సంపాదించిన ఆస్తిని కొంత గిఫ్ట్ రూపంలో తన భార్య సరోజమ్మ పేరుపై రాశిచ్చామని వివరించారు. ఆ ఆస్తిని కొట్టేయాలని కుట్ర చేస్తున్నారని వాపోయారు. తనను మానసి కంగా వేధిస్తున్న చిన్న కుమారుడైనా రమేష్ సనీలా, కోడలు కల్పనపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.


వినతి పత్రం ఇచ్చేందుకు వస్తున్న స్వామినాథన్

### తల్లీ కూతుళ్లను కాపాడిన పోలీసులు

**ఆత్మకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు మండలంలోని సిద్దాపురం గ్రామానికి చెందిన మేరీ, ఈశ్వర్ దంపతులు గొడవపడటంతో మేరీ తన పుట్టినిల్లయిన సంజీవనగర్ తండాకు వెళ్లింది. ఆ తర్వాత భార్యాభర్తలు మళ్లీ ఫోన్‌లో గొడవ పడగా మేరీ తన కుమార్తె రేణుకతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆందోళనకు గురైన భర్త ఈశ్వర్‌తోపాటు మేరీ తల్లి ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అర్బన్ సీఐ రాము మేరీ సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా ఆమె శ్రీశైలంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేసి తల్లీకూతుళ్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు పిలిపించి భార్య భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లీ కూతుళ్లను కాపాడిన ఆత్మకూరు పోలీసులను ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ రామాంజినాయక్ అభినందించారు.

### రైతులందరి వద్ద కొనుగోలు చేయాలి

- జేడీఎం రామాంజినేయులు


పత్తికొండ మార్కెట్‌లో టమోటాలను పరిశీలిస్తున్న జేడీఎం

**పత్తికొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** టమోటాను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని జేడీఎం (జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్) రామాంజినే యులు వ్యాపారులకు సూచించారు. కర్నూలు ఏడీఎం నారాయణ మూర్తితో కలసి ఆయన సోమవారం పత్తికొండ మార్కెట్‌యార్డులో టమోటా విక్రయాలను పరిశీలించారు. అనంతరం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు నుంచి కొనుగోలు చేయాలని సహకరించాలని సూచించారు. కార్యదర్శి కార్నలీస్, సిబ్బంది ఉన్నారు.

## ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, కంపెనీ ప్రతినిధులు, భూమా శోభానాగిరెడ్డి దంపతులకు నివాళి అర్పిస్తూ..

**ఉయ్యాలవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా, ఉయ్యాలవాడ మండలం, గోవిందపల్లెలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు సెల్ కంపెనీ సీనియర్ ఉపాధ్యక్షుడు సంజయ్ అహూజతో కలిసి భూమి పూజ చేశారు. ముం దుగా భూమా శోభా నాగిరెడ్డి జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి భర్త భార్గవరామ్‌నాయుడుతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సెల్ కంపెనీ ఉపాధ్యక్షుడు సంజయ్ మాట్లాడుతూ గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 500 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించామన్నారు. ఈ ప్లాంట్‌ను రూ.400 కోట్ల వ్యయంతో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా నిర్మిస్తున్నామని తెలిపారు. ఆరు నెలల్లో ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి 300 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు సహకరిస్తున్న ఎమ్మెల్యే, రైతులు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ బీజేపీ ఇన్‌చార్జి లక్ష్మీరెడ్డి, జనసేనా సమన్వయ కర్త మైలారి మల్లయ్య, సెల్ కంపెనీ డీజీయం నరేంద్ర పులివర్తి, ఏజీఎం నవీన్‌గ్రోవర్ పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలి


జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న భాస్కర్

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** ప్రైవేటు నర్సింగ్ కళా శాలలకు వత్తాసు పలుకుతున్న డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అండ్ నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో ప్రభుత్వ ఫీజులు వసూలు చేయకుండా అక్రమంగా అదనపు ఫీజులు చేస్తున్నారని ఆరోపించారు. అదనపు ఫీజులు వసూలు చేస్తున్న నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 15 రోజుల క్రితం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అం దజేశామన్నారు. కలెక్టర్ స్పందిస్తూ నర్సింగ్ కళాశాలలపై విచారణ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. కానీ ఆ కళాశాలలపై ఎటు వంటి విచారణకు గానీ, యాజమాన్యాలకు ఎటువంటి నోటీసులు కానీ ఇవ్వలేదని అన్నారు.

## అశోక్‌నగర్‌లో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** అశోక్‌నగర్ కేసీ కెనాల్ పక్కన స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని స్థానికుడు సుధాకర్ కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ స్పీడ్ బ్రేకర్ లేకపోడంతో ఇటీవల ఓ మహిళను వాహనం ఢీకొట్టడంతో గాయాల పాలైందన్నారు. అదేవిధంగా కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వాహనాలను అతివేగంగా నడుపుతున్నారన్నారు. స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎంఈ సత్యనారాయణను ఆదేశించారు. అదే విధంగా గతంలో టిడ్కో గృహలకు డబ్బులు కట్టామని వాటిని తిరిగి ఇప్పించాలని లబ్ధిదారులు, తిరుమలగిరి, ఎలైట్, కల్పవృక్ష, రాగమమూర్తి వెంచర్లలో నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి పన్ను వేయాలని స్థానికులు కమి షనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునైద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

## నకిలీ ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దు: కమిషనర్

**కర్నూలు న్యూసిటి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని వ్యాపార వాణిజ్య దుకాణదారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలంటూ ఏవైనా నకిలీ వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వాటిని నమ్మొద్దని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రాబు సోమవారం తెలిపారు. ఇటీవల కొందరికీ అపరిచిత వ్యక్తులు దుకాణాదారులకు ఫోన్ చేసి మీ దుకాణంపై ట్రేడ్ లైసెన్స్ బకాయిలు ఉన్నాయని, వెంటనే చెల్లిస్తే రాయితీ, కొంత నగదు ఇస్తే మాఫీ చేస్తామంటూ కొందరికీ నకిలీ ఫోన్ కాల్స్ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా ఏ నగర పాలక అధికారి కాల్ చేయరనే విషయాన్ని దుకాణాదారులు గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రతి దుకాణాదారుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, అయితే దాని కోసం నగర పాలక శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ లేదా సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీలను సంప్రదించాలని కోరారు. ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి ఏమైనా ఫోన్ కాల్స్ వస్తే నగర పాలక ప్రజారోగ్య అధికారి డా.కె.విశ్వేశ్వరరెడ్డి సెల్.నెం. 7680075621 ను సంప్రదించి ధ్రువీకరించు కోవాలని కమిషనర్ తెలిపారు.

## హ్యాండ్‌బాల్ విజేతలకు అభినందన

**కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు జరిగిన 10వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలలో కర్నూలు జిల్లా జట్టు విజేతగా నిలిచిందని జిల్లా సంఘం కార్యదర్శి డా.రుద్రారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలు పొందిన హ్యాండ్‌బాల్ క్రీడాకారులను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ శిక్షకుడు డీఎస్ఏ సిబ్బంది శేషఫణి పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు రిడ్జ్ పాఠశాల విద్యార్థి

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** స్థానిక లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పీ.జీవన్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో డిసెంబరు 22వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అండర్-12 సబ్ జూనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున రిడ్జ్ పాఠశాల విద్యార్థి ప్రాతినిధ్యం వహించనున్నట్లు సీఈవో గోపినాథ్, సౌమ్య అభినందించారు.



## రీ సర్వే అర్జీలకు పరిష్కారం చూపాలి

**గూడూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** రీ సర్వే గ్రామ సభల్లో వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని తహసీల్దార్ రామాం జనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులు వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు.

## ప్రభుత్వ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

**కోడుమూరు రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ, యువకులు కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 83743 76305 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



# ధనుర్మాస వేడుకలు ప్రారంభం



గోదా గోకుల క్షేత్రంలో అమ్మవారిని ఊరేగిస్తున్న గోకులం సభ్యులు, వాసవీ నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

**కర్నూలు కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** నగర శివారు మామిదాలపాడులోగల గోదా రంగనాథ స్వామి దేవస్థానం (గోదాగోకులం)లో ధనుర్మాస వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడకు చెందిన త్రిదండి అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ వేడుకలను ప్రారంభించారు. ఆలయం లోని మూల మూర్తులకు, ఉత్సవ మూర్తులకు ఉదయం 4.30 గంటల నుంచి నిత్య ఆరాధన కార్యక్రమాలు ప్రారంభించారు. శ్రీదేవీ, భూదేవి సమేత రంగనాథ స్వామి వారికి శ్రీగోదా కృష్ణులకు, సాలగ్రామాలకు అభిషేకం, అర్చక స్వాములచే పంచసూక్త పారాయణం, మహా మండపం లో భక్తులచే విష్ణు సహస్ర పారాయణం, గోవింద నామాలు పఠించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అలంకరణ, తోమాల సేవ, తెలుగులో తిరుప్పావై పఠనం, గానం చేశారు. రంగనాథ, శ్రీలక్ష్మి, గోదాదేవి అమ్మ వారికి అష్టోత్తర శతనామార్చనలు, నివేదన సమర్పించి, మాఢవీధుల్లో నగర సంకీర్తన చేశారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్య క్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యు లు పాల్గొన్నారు. నగరంలోని ఉల్చాల రోడ్డులోగల వాసవీనగర్‌లోని వేంకటే శ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథ స్వామి వార్లకు తిరుప్పావై పూజ చేశారు. బాజా భజంత్రీలతో తిరుప్పావైలోని మొదటి రోజు పాశురాన్ని పారాయణం చేశారు. కార్యక్రమంలో ఎలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల భరతమాత ఆలయంలో కర్నూలు విష్ణు సహస్ర నామ సత్సంగం అధ్యక్షుడు, ఆలయ కోశాధికారి మల్లెల పెద్ద పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక తిరుప్పావై పాశురాలు, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

**కోడుమూరు రూరల్:** మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేకువజామున మేళతాళాల మధ్య హంద్రీ జలాలు తీసుకవచ్చి స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. ఆలయంలో జనవరి 10న వైకుంఠ ఏకాదశి, భక్తులకు ఉత్తరద్వార దర్శనం 13న గోదా, మాధవస్వామి కల్యాణం, 14న గ్రామో త్సవం, చక్రస్నానం నిర్వహిస్తామని ఈవో గుర్రెడ్డి తెలిపారు.


భరతమాత ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు

● 18న టెంకాయల వేలం: లక్ష్మీమాధవస్వామి ఆలయంలో టెంకాయలు విక్రయించుకోవడానికి ఈనెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు. వేలంలో అత్యధిక ధర పలికిన పాటదారుడు ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది డిసెంబరు 24 వరకు టెంకాయలు విక్రయించుకోవడానికి హక్కు ఉంటుందని ఈవో తెలిపారు.

# శిక్షణ పొందిన అభ్యర్థులకు వేతనాలివ్వాలి

### కలెక్టరేట్ ఎదుట రజక వృత్తిదారుల ధర్నా

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** విశ్వకర్మ కౌశల్య యోజన పథకం కింద శిక్షణ పొందిన అభ్యర్థులకు వేతనాలు ఇవ్వాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం నగర అధ్యక్షురాలు జయమ్మ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సి.గురుశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌశల్య యోజన పథకం కింద 2023లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకున్నామన్నారు. అయితే రెండు నెలల క్రితం స్కిల్ అకాడ మీలో పథకం దోబీ వృత్తి కోసం ఐదు రోజులు శిక్షణ ఇచ్చిందన్నారు. శిక్షణ లో ప్రతిరోజు రూ.500 చెల్లిస్తామని ఇప్పటి వరకు ఒక్కపైసా ఇవ్వలేద న్నారు. ఎలాంటి గ్యారంటీ లేకుండా రజకవృత్తిదారులకు బ్యాంకుల ద్వారా రూ.లక్ష రుణాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, శేషాద్రి, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మధు, ఈశ్వరమ్మ, పుష్ప, పద్మ పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గురుశేఖర్

**జేసీకి వినతి**

**కర్నూలు కలెక్టరేట్:** విశ్వకర్మ కౌశల్య యోజన పథకంలో దోబీ వృత్తి శిక్షణ తీసుకున్న వారికి రోజువారి వేతనం, వృత్తి పరికరాల కోసం బ్యాంకు రుణాలు ఇప్పించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతి పత్రం అందజేశారు.

## బాల కార్మికుల వెట్టి చాకిరిపై తనిఖీలు


బాలకార్మికుల వెట్టిచాకిరిని గుర్తించేందుకు వెళ్తున్న అధికారుల బృందం

**కర్నూల లీగల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్-4 లో భాగంగా కర్నూలు నగరంలో బాలకార్మికులు వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబ శివ, ఎల్.హేమాద్రిల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు, వివిధ నగరంలోని కొత్తబస్టాండు, పాతబస్టాండు, బళ్లారి చౌరస్తా, సంతోష్ నగర్, బుధవారపేట తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారని తెలిపారు. బుధవారపేటలో ఒక బాల కార్మికున్ని గుర్తించి ఆ బాల కార్మికుడికి, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారితో కలిపామన్నారు. కార్యక్రమంలో డీసీపీవో శారద, పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

## 21న మండల సర్వసభ్య సమావేశం

**ఓర్వకల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లులో మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21వ తేదీన నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈసమా వేశం ఎంపీపీ తిప్పన్న అధ్యక్షత జరుగుతుందని, ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరిత హాజరవుతారని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు వాటి పురో గతిపై చర్చ ఉంటుందన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖ అధికారులు హాజరు కావాలని కోరారు.

## ఖాసిం మృతి పార్టీకి తీరనిలోటు

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** సీపీఐ సీనియర్ నాయకుడు దిగురె ఖాసిం మృతి తీరని లోటని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాసిం విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడంతోపాటు విద్యార్థులకు చైతన్యపరిచేవారన్నారు. ఖాసిం కుటుంబానికి సంతాపాన్ని ప్రకటిస్తున్నామన్నారు.

## ఘనంగా క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్

**కర్నూలు కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో సోమవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి క్వాయర్ డైరెక్టర్స్ రవీంద్రనాథ్, ఫ్రాంక్లిన్ సుకుమార్, సుధీర్ కుమార్, రవికాంత్‌ల ఆధ్వర్యంలో క్వాయర్ బృందం భక్తి గీతాలను ఆలపించారు. అంతకు ముందు చర్చి పాస్టర్లు, క్వాయర్ డైరెక్టర్లు, ముఖ్య ప్రసంగీకులు, స్టాండింగ్ కమిటీ, క్వాయర్ బృందం కొవ్వొత్తులు వెలిగించి చేత పట్టుకొని ఆలయంలోకి ప్రార్థన పూర్వకంగా ప్రవేశించారు. ఈకార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేసిన నెల్లూ రులోని ఎక్లీషియా బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవ. గ్లాడ్సన్ రామపోగు మాట్లాడుతూ క్రీస్తుప్రభువు ఈ లోకానికి పాపమనే చీకటిలో నుంచి తన ప్రజలకు రక్షించి వెలుగులోనికి నడిపించుటకు వచ్చాడని ఉద్బోధించారు. అనంతరం క్యాండిల్స్ వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్ష, కార్యదర్శులు ఏడీఏ లింకన్, జాన్ విల్సన్, పాస్టర్లు రెవ. అనిల్‌కుమార్ శ్యామ్యూల్, రెవ. ఎస్‌జే జీవన్ రావు, రెవ. పాస్కల్ ప్రకాశ్, క్రిస్మస్ కమిటీ సభ్యులు భాస్కర్‌రావు, ప్రసన్న, రూపస్ రేనాల్డ్, డేవిడ్ సునీల్, సహాయక డైరెక్టర్లు వినయ్‌కుమార్, అక ర్మన్ విన్సీ పాల్గొ న్నారు.


భక్తిగీతాలు ఆలపిస్తున్న కోల్స్ చర్చి గాయక బృందం

## తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలి

### మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్


విద్యార్థులతో మహ్మద్ ఇక్బాల్

**కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** తల్లిదండ్రుల ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. సోమవారం నన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. పాఠశాల విద్యార్థుల క్రీడా సామగ్రి కోసం రూ.20వేలు, పది విద్యార్థుల అల్పాహారం కోసం మరో రూ.30వేలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత మల్‌హోత్ర, మాజీ కార్పొరేటర్ జి.సురేంద్ర పాల్గొన్నారు. అలాగే విలువైన స్పోర్ట్స్ కిట్లు, నగదు ప్రోత్సా హకాలు, స్టడీ మెటీరియల్స్‌ను అందజేసిన మహ్మద్ ఇక్బాల్‌ను పాఠశాల విద్యాకమిటి చైర్మన్ విజయుడు రూ.2వేలు నగదును అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్ ఎం.అనిత, మద్దులేటి, రాజీవ్ కుమారి, కళావతి, హన్నాసైమన్, గౌరినందనరెడ్డి, ప్రేమ్ కుమార్, లక్ష్మీనారాయణ, ఏవీజేవీ ప్రసాద్, వెంకటేశ్వర్లు, లింగస్వామి ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను అభినందించారు.

## సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**ఓర్వకల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** రైతుల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. సోమవారం మండలంలోని కొమరోలు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 86 అర్జీలు వచ్చాయి. అందులో భూసర్వేలు, గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వేలో కొలతలు తప్పులు తడకగా వచ్చాయని, సాగు చేసుకున్న భూములకు పట్టా లు ఇవ్వాలని అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, వీఆర్వో బాలమద్దిలేటి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## 'రేషన్ బియ్యం సరఫరాను అడ్డుకోవాలి'

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు తరలిపోతున్న రేషన్ బియ్యం సరఫరాను అడ్డుకో వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. సోమవారం 48వ వార్డు రోజావీధిలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు శేషమ్మ, నారాయణమ్మ, ఆంజనేయులు, జాకీర్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు జ్ఞాపికలు ప్రదానం

**కర్నూలు కల్చరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** నగరంలోని వీహెచ్‌పీ, విజ్ఞాన పీఠం (అరక్షిత శిశుమందిరం) సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల గీతా జయంతి సందర్భంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పఠన పోటీల్లో విద్యార్థులకు శ్లోకాలు నేర్పించిన ఉపాధ్యాయులను అభినందించారు. సోమవారం విజ్ఞాన పీఠంలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞానపీఠం కార్యదర్శి పీపీ గురుమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావం పెంచాలన్నారు. అనంతరం ఆయన ఉపాధ్యా యులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు మాళిగి వ్యాసరాజ్, ఉపాధ్యాయులు చంద్రమోహన్, నాగేశ్వర రెడ్డి, రణధీర్ రెడ్డి, సోమయ్య, సుదర్శన్ రావు, స్వర్ణలత పాల్గొన్నారు.

## అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ

**కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** నగరంలోని రద్దీ ప్రాంతాలు, రహదారుల్లో నిద్రిస్తున్న అభాగ్యులకు అజ్వా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అధ్యక్షుడు సాజిద్ ఖాన్ దుప్పట్లు పంపిణీ చేశారు. నగరంలోని రైల్వేస్టేషన్, కర్నూలు పెద్దాసుపత్రి, కొత్తబస్టాండు, బళ్లారి చౌరస్తా, పెద్దపార్కు తదితర ప్రాంతాల్లో చలికి వణికిపోతున్న అభాగ్యులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగిం దని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా చలికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు యాసీద్, సమీర్, వీరేష్, జాకీర్ పాల్గొన్నారు.

## అధికారులపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాసరావు

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** నకిలీ పట్టాలకు ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్ చేస్తున్న కార్పొరేషన్, రిజిస్ట్రేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులపై కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలో సర్వే నెంబరు 163లోని కొన్ని ప్లాట్లకు కొందరు నకిలీ పట్టాలను సృష్టించారన్నారు. వాటిని ఎటువంటి తనిఖీలు చేయకుండా ఇంటి పన్నును కార్పొరేషన్ అధికారులు కేటాయించారని, ఇంటి పన్నుపై రిజిస్ట్రేషన్ అధికారులు కూడా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేశారని అన్నారు.

## సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**కల్లూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** ఆటో కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. సోమవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి ఆయన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లా డుతూ ప్రభుత్వం భారీ జరిమానాలు పెంచే జీఓ నెంబరు 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఆటో మోటార్ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఓ, పోలీస్ చలానాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, యూనియన్ నాయకులు మధు, ఈశ్వర్, గణేష్, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీలో ప్రజారోగ్యానికి పెద్దపీట


సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న గౌరు వెంకటరెడ్డి

**కల్లూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం తన స్వగృహంలో ఆయన అర్హులైన బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అందులో భాగంగా గౌరు వెంకటరెడ్డి లక్కం సావిత్రికి రూ.30,000 వేలు, బండ హనుమంత్- 50,000 వేల చెక్కును అందజేశారు.

## ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం దురదృష్టకరం: డీటీఎఫ్

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** 6 నుంచి 12వ తరగతుల గణితం పేపర్లు ఎవరో యూ ట్యూబ్‌లో లీక్ చేశారని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం దురదృష్టకరమని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీజీ వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మిగిలిన పేపర్లను పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని వెబ్ ఎక్స్ మీటింగ్‌లో కమిషనర్ ఆదేశాలు జారీ చేయడం విచిత్రంగా ఉందన్నారు. ఇళ్లకు చేరుకున్న తర్వాత మరీ పాఠశాలకు వెళ్లి ఈ రాత్రి వేళల్లో స్టేషన్‌లో అప్పజెప్పడం అనేది సముచితం కాదన్నారు.

## ఎనిమిదో రోజు కార్మికుల సమ్మె


గూడూరులో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు జీతాలు పెంచాలని కోరుతూ చేస్తున్న సమ్మె సోమవారానికి ఎనిమిదో రోజుకి చేరింది. నగర పాలక కార్యాలయం ఎదుట టెంట్ ఏర్పాటు చేసుకుని దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జి.రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, కాశపోగు జ్ఞానమ్మ, జి.వెంకటేష్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

**గూడూరు:** సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అరవింద్, ఎ.మధు, దూకేశ్వరరావు అన్నారు. సోమవారం గూడూరులో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్నికల్‌లకు వేతనం రూ.29,200, రూ.24,500 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బసవరాజు, షబ్బీర్ బాష, హుసేన్ ఖాన్, ఖాజా హుసేన్, జయన్న, అల్లి బాషా, మధు, హరి, రజాక్ పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారి

**కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన అవసరమని ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి ఐ.హేమలత అన్నారు. సోమవారం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రాగమ యూరీలో ఆమె ఎన్‌సీడీ 3.0 సర్వేను తనిఖీ చేశారు. నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ సర్వేలను నాణ్యతగా నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా నయం కానీ పుండ్లు, గాయాలను నిర్లక్ష్యం చేయరాదని, క్యాన్సర్‌ను ప్రాథమిక దశల్లోనే గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.రాఘవరావు, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి.సుధాకర్, సీహెచ్‌వో కే.వినిత పాల్గొన్నారు.

# ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

## వ్యక్తి అరెస్టు

**ఆదోని రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):** హొళగుంద మండలం ఇంగళదహాళ్‌కు చెందిన వీరభద్రను ఇస్వీ పోలీసులు అరెస్టు చేశారు. బైకుపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా, సోమవారం సంతేకుడ్లూరు సమీపంలో 100 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

## మాది రైతు ప్రభుత్వం



మాట్లాడుతున్న కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప

**ఆదోని రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** తమది రైతుల ప్రభుత్వం ప్రభుత్వమని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. సోమవారం ఎద్దహరివాణం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్య ఉన్న ప్రజలు, రైతులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వినతులను 45 రోజుల్లోపు పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ శివరాముడు తెలిపారు.

## రెండు రోజుల శిక్షణ

**మద్దికెర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ ఇస్తున్నట్లు ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలంపై ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆదార్ లింక్ చేయబడిన మొబైల్ ఫోన్‌తో తప్పక హాజరు కావాలన్నారు.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమించవద్దు


ప్రభుత్వ స్థలంలోని బోర్డు వద్ద స్థానికులు

**మద్దికెర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ స్థలాలు ఎక్కడా కూడా ఆక్రమించవద్దని తహసీల్దార్ హుశేన్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. సోమవారంసాయినగర్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో బోర్డును పాతించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరమన్నారు. బోర్డు ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## రీసర్వే తప్పులు సరిచేయాలి


తుగ్గలిలో మాట్లాడుతున్న బొల్లవానిపల్లె రైతులు

**తుగ్గలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** వైసీపీ ప్రభుత్వం చేసిన రీసర్వే తప్పులను సరిచేయాలని టీడీపీ నాయకులు రంగారెడ్డి, శివ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీటీ నాగరాజుకు వినతి పత్రం ఇచ్చారు. రీ సర్వేతో రైతులు ఘర్షణ పడుతున్నారని సరి చేయాలన్నారు. అలాగే సర్వేయర్ లోకేశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సమస్యల పరిష్కారానికి పోరాడదాం

**పత్తికొండ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** రైతుల సమస్యల పరిష్కారానికి పోరాడదామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పిలుపు నిచ్చారు. సోమవారం ఈశ్వర్ రెడ్డి భవన్‌లో పార్టీ మహాసభలను నిర్వహించారు. ముందుగా రంగారెడ్డితో కలిసి జెండాను ఆవిష్కరించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో హంద్రీనీవా పిల్లకాల్వల నిర్మాణానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమించాలని అన్నారు. దిగుబడులకు గిట్టుబాటు అనంతరం సీపీఎం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి, సభ్యులుగా దస్తగిరి, గోపాల్, సురేంద్ర, గంగన్న, రామాంజనేయులును ఎన్నుకున్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి


పూజలు చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

**ఆలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):**అల్లీపీరా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గుడికల్లు అల్లీపీరా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాలీసాబ్, గౌస్, గురుస్వామి, షేక్షావలి, నరసన్న, కిష్టప్ప, బండయ్య, నీలకంఠ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వంతో కుటుంబానికి రక్ష


సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

**పత్తికొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కుటుంబానికి రక్షణ కవచం లాంటిదని ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్రనాయకుడు న్యాయవాది సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం పత్తికొండ 15వ వార్డులో పట్టణ అధ్యక్షుడు సింగం శ్రీనివాసులుతో కలసి సభ్యత్వనమోదులో పాల్గొన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు.




పట్టణంలోని అరికెర రోడ్డులోని ఎస్సీ హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉంది. పదేళ్లుగా ఎవరూ పట్టించుకోక పోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి, పందులకు స్థావరంగా మారింది. ఆలూరులో బీసీ బాలుర, బాలికల హాస్టళ్లకు స్వంత భవనాలు లేవు. ఈ స్థలంలో నూతన భవనాన్ని నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. **-ఆలూరు**




మండలంలోని బసినేపల్లి, కొట్టాల రహదారిలోని కల్వర్టు కోతకు గురైంది. ఈ రహదారిలో వాహనదారులు, పాదచారులు, ఎడ్లబండ్లపై రైతులు ప్రయాణిస్తుంటారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.పీఆర్ ఏఈ విష్ణు మాట్లాడుతూ కల్వర్టుకు మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. **-మద్దికెర**

## 'యేస్రుక్రీస్తుతో లోకానికి వెలుగు'


క్రీస్తు పుట్టుక నాటకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

**ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** యేస్రుక్రీస్తు పుట్టుకతో లోకానికి వెలుగు అని పాస్టర్ సుజిత్ విలియం అన్నారు. సోమవారం పట్టణంలోని విక్టోరియా పేట సీఎస్‌ఐ చర్చిలో సఫోజ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాపులను రక్షించడాని యేస్రు క్రీస్తు ఈ లోకానికి మానవునిగా జన్మించారన్నారు. అనంతరం చిన్నారులు యేసుక్రీస్తు జననం నాటకాన్ని ప్రదర్శించారు. కేక్ కట్ చేసి క్యాండిలైట్ నిర్వహించారు. సంఘ కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్, ట్రెజరర్ శ్రీకాంత్, సౌజన్య, జనార్ధన్ అమృత్ పాల్గొన్నారు.

## రైతు సేవకు కట్టుబడిన కూటమి


విజేతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

**ఆదోని, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి):** రైతులకు సేవలందించేదుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సాగునీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానించారు. నీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన వారు రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, బీజేపీ నాయకులు నాగరాజు గౌడ్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ముందు ఇతర పార్టీలు నిలువ లేవు


గెలుపొందినవారిని సన్మానిస్తున్న వైకుంఠం శివ ప్రసాద్

**ఆలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ ప్రభంజనం ముందు ఇతర ఏ పార్టీలు నిలువలేవని ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్, నాయకురాలు వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. హెబ్బటం గ్రామంలో అత్యధిక సభ్యత్వాలు చేసిన నాయకులను సోమవారం రాత్రి సన్మానించారు. రాష్ట్రంలో టీడీపీకి విశేష లభిస్తోందని, సాగునీటి సంఘం ఎన్నికలే నిదర్శనమన్నారు. పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని, కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించడం హర్షనీయమన్నారు. తిప్పయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, తోక వెంకటేష్, నబీ రసూల్, వీరేంద్ర, ఖాదర్, నవారప్ప, సాగునీటి సంఘం అధ్యక్షురాలు సరస్వతమ్మ, వైస్ చైర్మన్ పక్కీరప్ప పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులు విఫలం

**పత్తికొండ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** దళితుల భూములకు రక్షణ కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫమయ్యారని ఎమ్మార్పీఎస్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ మాదిగ ఆరోపించారు. సోమవారం క్రిష్ణగిరి మండలం మాదాపురం గ్రామ బాధితులతో కిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. గిడ్డయ్య, రామాంజనేయులు, రంగన్న, మద్దిలేటి, హరి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## ధనుర్మాస పూజలు ప్రారంభం

**మద్దికెర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెరవలి గ్రామంలోని శీరంగనాథ ఆలయంలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో వీరయ్య, అర్చకులు రంగస్వామి అన్నారు. ఉదయం 6 గంటలకు ధనుర్మాస సేవలు గావించారు. 30 రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ధనుర్మాస పూజలు జరుగుతాయన్నారు.

## సంక్షేమం మరిచారు..


పబ్లిక్ కొళాయి వద్ద నీరు తాగుతున్న విద్యార్థులు


అద్దె భవనంలో హాస్టల్

**తాగు నీరు లేదు..**

హాస్టల్‌లో విద్యార్థులకు తాగునీరు లేదు. భోజనం చేసిన తర్వాత తాగునీటి కోసం రోడ్ల వెంట ప్లేట్లు పట్టుకుని పరుగులు తీస్తున్నారు. రోడ్డుపై ఉన్న పబ్లిక్ ట్యాంకు వద్దకు వెళ్లి నీరు తాగుతున్నారు. ఇక స్నానం కూడా ఇక్కడే చేయాల్సి వస్తోంది.

- ఆర్ఎస్ పెండేకల్ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో తాగునీరు లేక విద్యార్థుల అవస్థ
- పబ్లిక్ కొళాయి వద్దే తాగునీరు, స్నానం అన్నీ..
- అద్దె భవనంలో హాస్టల్ నిర్వహణ

**తుగ్గలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెండేకల్ ఆర్ఎస్‌లో సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ హాస్టల్‌లో 150 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఇందులో నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరు స్థానిక ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు.

**అపరిశుభ్రమైన ట్యాంకు**

ఈ ట్యాంకు గ్రాబ పంచాయతీకి చెందినది. నీరు కూడా కలుషితంగా వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకును శుభ్రం చేయడం లేదని పాచి పట్టిందని, ట్యాంకుపై మూత కూడా వేయక పోవడంతో దుమ్ము పడుతోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ్లలో కూడా ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు. ఈ విషయంపై హాస్టల్ సిబ్బందిని వివరణ కోరగా.. హాస్టల్‌లో తాగునీరు లేక చాలా రోజులైందని తెలిపారు.

## సమస్యలను వేగంగా పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

**ఆదోని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ డేలో అర్జీలను స్వీకరించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని సూచించారు. ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన లక్ష్మి తనకు గోనెగండ్ల మండలం అల్వాల గ్రామంలో సర్వే నెం. 195/1సి2లో 0.5 ఎకరాల భూమి తనకు పెద్దల నుంచి సక్రమించిందని ఆన్‌లైన్‌లో తన పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

## రైతుల సమస్యలు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా..?

**మద్దికెర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** వైసీపీ నాయకులకు రైతుల సమస్యలు ఇప్పుడు గుర్తుకు వచ్చాయని జిల్లా తెలుగు మహిళ అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి అన్నారు. సోమవారం ఎరవలి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. రీ సర్వే చేసి రైతుల పొలాల్లో సొంత ఫొటోలు వేసుకోలేదా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేశామన్నారు. ఇకపై తప్పుడు మాటలు మానుకోవాలని, లేకపోతే ప్రజలు, రైతులే మీకు మళ్లీ బుద్ధి చెబుతాని అన్నారు.


చిన్నారులతో ఎంఈవో, నాయకులు

## సీజనల్ హాస్టల్ ఏర్పాటు

**తుగ్గలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** వలస కూలీల విద్యార్థుల కోసమే సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్ అన్నారు. సోమవారం పగిడిరాయి, జొన్నగిరి, ఎర్రగుడి, చెన్నంపల్లి, కోతికొండ గ్రామాల్లో సీజనల్ హాస్టల్స్‌ను ప్రారంభించారు. తల్లిదండ్రులు వలస వెళితే పిల్లలను హాస్టల్‌లో ఉంచాలని కోరారకీ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, సర్పంచులు ఓబులేసు, విజయుడు, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, టీడీపీ నాయకులు మాబాషా, రాజేంద్రగౌడు, బాలన్న శ్రీనివాసులుగౌడ్, మిద్దె వెంకటేష్ యాదవ్, రవికుమార్, అయ్యన్న ఉన్నారు.

## మా హక్కులను కాలరాస్తున్నారు

- సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన సర్పంచులు



నిరసన తెలుపుతున్న సర్పంచులు

**ఆదోని రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం తమ హక్కులను కాలరాస్తుదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటేశులు, బైచిగేరి, విరుపాపురం, నెట్టేకల్లు సర్పంచులు మహదేవ, ప్రహ్లాద, రామాంజనేయు మాట్లాడారు. తమ ప్రమేయం లేకుండానే కూటమి నాయకులు అభివృద్ధి పనులు చేయడంపై అభ్యంతరం తెలిపారు. పంచాయతీ తీర్మానం లేకుండా పనులు ఏలా చేస్తారని ప్రశ్నించారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. రాజశేఖర్ గౌడ్, నారాయణ, ఉచ్చప్ప, మహ్మద్ అలీ, నరసింహులు, వరదప్ప, సువర్ణ, నాగిరెడ్డి పాల్గొన్నారు.

## పంటల బీమా నమోదు చేసుకోండి

**వెల్దుర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** రబీ సీజన్‌లో పంటల బీమా నమోదు చేసుకోవాలని ఏవో అక్బర్‌బాషా తెలిపారు. సోమవారం మాట్లాడుతూ పప్పుశనగ, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నమోదు చేసుకోవాలని సూచించారు.

## మూగ జీవాల మృత్యువాత

**ఆస్పరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** చిన్నహోతురు గ్రామ రైతు కొలకరి శ్రీనివాసులుకు చెందిన ఆవు, గేదె విష్యతుల్య గ్రాసం తిని సోమవారం మృతి చెందాయి. మరో ఆవు, గేదె ఆపస్మా రక స్థితికి వెళ్లాయి. నూర్పిడి చేసిన కంది పొట్టును తిని ఇలా అయినట్లు బాధితుడు తెలిపారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళి



**దేవనకొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళి మోహన్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ప్రశ్న:** జలజీవన్ మిషన్‌ను ఎన్ని గ్రామాల్లో అమలు చేశారు?

**జవాబు:** వెలమకూరు,గద్దెరాళ్ల, పల్లెదొడ్డి, బెల్లందొడ్డి గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేశాం. మరి కొన్ని గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

**ప్రశ్న:** రక్షిత మంచినీటి పథకం ద్వారా ఎలాంటి పనులు చేస్తున్నారు?

**జవాబు:** బోర్లు మరమ్మతులకు గురైతే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తున్నాం.

**ప్రశ్న:** మండలంలో ఎన్ని నీటి పథకాలు ఉన్నాయి?

**జవాబు:** బండగట్టు, క్రిష్ణగిరి నీటి పథకాలు ఉన్నాయి. ఒక్కో పథకం ద్వారా 11 గ్రామాలకు రోజు తాగునీరు అందిస్తున్నాం.

**ప్రశ్న:** తాగుటి సమస్య రాకుండా చర్యలు తీసుకున్నారా?

జవాబు: మండలంలోని కె వెంకటాపురంలో ప్రతి వేసవిలో నీటి ఏద్దడి తలెత్తుతుంది. క్రిష్ణగిరి నీటి పథకం పైపులైను పగిలిపోవడంతో సమస్య ఏర్పడింది. నిధులు మంజూరైతే మరమ్మతులు చేస్తాం.

**ప్రశ్న:** అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీరు అందిస్తున్నారా?

**జవాబు:** 33 అంగన్‌వాడీ కేంద్రాల్లో ట్యాంకు ఏర్పాటు చేసి, కుళాయి ద్వారా నీరందిస్తున్నాం.

# పప్పుశనగకు పచ్చపురుగు

● ఆకులు, పూతను తినేస్తున్న పురుగు
● ఆందోళనలో రైతులు

**గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలో రబీలో సాగు చేసిన శనగ పంటకు రబ్బరు పచ్చ పురుగు సోకింది. ప్రస్తుతం ఈ పంట పూత దశలో ఉంది. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాల్లో 5000 ఎకరాల్లో శనగ పంటను రైతులు సాగుచేశారు. ప్రస్తుతం పచ్చపురుగు నియోజకవర్గంలో దాదాపు 3000 ఎకరాలకు సోకింది. ప్రస్తుతం పూతను మొత్తం రబ్బరు పచ్చపురుగు తినేస్తుంది.


పంటను ఆశించిన పచ్చ పురుగు


పచ్చ పురుగు సోకిన శనగ పంట

పురుగు నివారణకు క్రిమిసంహారక మందులు ఎన్ని వాడినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు. గత నాలుగురోజులుగా ఆకాశం ముసురుకొని ఉండటం వల్ల పురుగు మరింత పెరిగింది. ప్రస్తుతం ఈ పంట ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల కంటే ఎక్కువ వచ్చేవిధంగా కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### తీవ్రంగా నష్టపోతున్నాం

రెండు ఎకరాలు శనగ పంట సాగు చేశాను. శనగపంట పై రబ్బరు పచ్చపురుగు సోకింది. పంటకు తీవ్రంగా నష్టం కలుగుతుంది. దీంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. పురుగు నివారణ కోసం ఎన్ని మందులు వాడినప్పటికి ప్రయోజనం కనిపించడం లేదు. ఈ ఏడాది తెగుళ్ల అధికమయ్యాయి.

- చెన్నలరాయుడు, రైతు, గోనెగండ్ల

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పురుగు నివారణ కోసం రైతులు సస్యరక్షణ చర్యలు చేట్టాలి. వ్యవసాయ అధికారులను కలిసి సలహాలు తీసుకోవాలి. బొరుగులలో పసుపు కలిపి పొలంలో చల్లాలి. పసుపు రంగు బొరుగులకు పక్షులు ఆకర్శించబడి పొలంలోకి వచ్చి ఈ బోరుగులతో పాటు లద్దెపురుగులను కూడా తిని పంటను రక్షిస్తాయి.

- మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

## సమష్టి కృషితోనే సాగునీటి ఎన్నికల్లో విజయం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


సాగునీటి సంఘాల అధ్యక్షులు, వైస్ చైర్మన్లతో రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ, జనసేన, బీజేపీ సమష్టి కృషితోనే సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధ్యమైందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం రాఘవేంద్రరెడ్డిని కౌతాళం మండలంలోని టీడీపీ నాయకులు సురేష్ నాయుడు సతీష్ నాయుడు, అడివప్పగౌడు, వెంకటపతిరాజు, టిప్పు సుల్తాన్, నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు సన్మానించారు. గెలిచిన ప్రతి ఒక్కరు కార్యకర్తలందరిని కలుపుకుని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, కురువ వీరేష్, చంద్ర మహాదేవ నాయుడు, మారెప్ప, శివ, మహ్మద్ హుశేనీ, బసవరాజు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ

**కౌతాళం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ అధ్యాపకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా బోర్డు సంకల్ప్ పేరిట మెటీరియల్‌ను సరఫరా చేసిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డేవిడ్, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, సంధ్యారాణి పాల్గొన్నారు.

## జనసేనను బలోపేతం చేస్తాం

మంత్రాలయం జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న


మాట్లాడుతున్న లక్ష్మన్న

**కోసిగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామని, జనసైనికులు కూడా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఐక్య వాల్మీకి, బోయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, జనసేన ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. మండల పరిధిలోని గౌడు గల్లు గ్రామంలో జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఆ పార్టీ కోసిగి మండల నాయకుడు ఈరెడ్డి, గ్రామ నాయకుడు గొళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బి.లక్ష్మన్న మాట్లాడుతూ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మంత్రాలయం నియోజకవర్గంలోని గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కారు వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం గ్రామ జనసేన నాయకులు ఇన్‌చార్జి లక్ష్మన్నను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శివారెడ్డి, నరసింహ, నాగరాజు, రవికుమార్, జయకృష్ణ, నరసప్ప, ఉరుకుందు, ఈరన్న, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్రపై వరద కాలువ నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**కౌతాళం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మండలంలోని మేళిగనూరు వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నదిపై వరద కాలువను నిర్మిస్తే పశ్చిమ ప్రాంత వాసులకు లబ్ధి చేరుకుతుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ అన్నారు. సోమవారం సీపీఎం మహాసభలను మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో నిర్వహించారు. ముందుగా సీపీఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. మండలంలో తుంగభద్ర నది ప్రవహిస్తున్నా నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీరు అందక వలసలు పోతున్నారని అన్నారు. ప్రతి ఏడాది తుంగభద్ర నది నుంచి 70నుంచి 100టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతున్నదన్నారు. అలా కాకుండా తుంగభద్రనదిపై వరద కాలువను నిర్మిస్తే మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గ రైతులకు తాగు, సాగునీరు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, నాయకులు మల్లయ్య, ఈరన్న, రామలింగ, వీరేష్, నాగరాజు, మారయ్య పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

**మంత్రాలయం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మోటారు సైకిల్ అదుపు తప్పి కిందపడటంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంత్రాలయం మండలంలోని మాధవరం సమీపంలో తుంగభద్ర రోడ్డు సెయింట్ మార్థోమా స్కూల్ సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని రాజోలిబండ గ్రామానికి చెందిన వీరేష్, అతని భార్య లక్ష్మి దంపతులు బసాపురం-52 గ్రామానికి వెళ్లి సొంత గ్రామానికి వెళ్తుండగా.. మోటారు సైకిల్ అదపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాయచూరు ఆసుపత్రికి తరలించారు.

## గుండెపోటుతో ఎస్ఎంసీ చైర్మన్ మృతి

**గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని ఉర్దూపాఠశాల కమిటీ చైర్మన్ బగిలి ఖాజాసాహెబ్ గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. మందకల్లు జాతరలో వ్యాపారం చేస్తుండగానే బీపీ పడపోయి గుండెపోటు వచ్చింది. దీంతో అక్కడికక్కడే నేలకొరిగాడు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న గోనెగండ్ల టీడీపీ నాయకులు ఖాజా సాహెబ్ మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రమేష్‌నాయుడు, నూరసాహెబ్, రంగస్వామినాయుడు, వినోద్‌గౌడ్, డాక్టర్ మిన్నల్ల, గౌండరహంతుల్లా, కొత్తింటి ఫక్రుద్దీన్ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీస్ రేటు ప్రకారం వేతనాలు ఇవ్వాలి

**ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ రీడర్స్‌గా పనిచేస్తున్న కార్మికులకు పీస్ రేటు ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ అగ్రిమెంట్, ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్లు ఇవ్వడం సరికాదన్నారు. రీడర్స్ కడుపుకొడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఇవ్వాలని కోరారు. విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ రాజుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, భీమేష్, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వేడి నీళ్లకు పెరిగిన డిమాండ్

బిందె నీరు రూ.50

**మంత్రాలయం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం పుణ్యక్షేత్రంలో వేడి నీళ్లకు డిమాండ్ పెరిగింది. బిందె వేడి నీరు రూ.50 ధర పలుకుతుంది. రెండు రోజుల నుంచి చలి తీవ్రత అధికంగా ఉండటంతో మంత్రాలయంలో వేడి నీటి కోసం భక్తులు ఎగబడుతుండటంతో డిమాండ్ పెరిగింది. పలు లాడ్జీల్లో కట్టెలతో వేడిని కాచి రూములకు అందజేస్తున్నారు. వేడినీరు కాస్తూ మంత్రాలయంలో పలువురు ఉపాధి కలుగుతుంది.

## ఉరుకుంద దేవాలయంలో రుద్ర హోమం


రుద్ర హోమం చేస్తున్న అర్చకులు

**కౌతాళం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సోమవారం రుద్ర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు మాట్లాడుతూ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ విశిష్టతను తెలియజేసేలా హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్ప స్వామి, శివన్న స్వామి, పూజన్న స్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాల తనిఖీ


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

**ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని క్రాంతినగర్, దళిత వాడలోని సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సర్వేల గురించి వాకబు చేసి పలు సూచనలు ఇచ్చారు. సమయపాలన పాటించాలని, సకాలంలో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఈ నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

**నందవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం భద్రకాళి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో వేదపండితులు వీరభద్రస్వామి, గణేష్ స్వామిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో గోపురం నిర్మాణ దాత పీసీ నరసింహయ్య దంపతులు, కలశ ప్రతిష్ఠ చేసిన కేజీ రమేష్, ఉరుకుందయ్య శెట్టి, ప్రతాప్ రంగయ్యశెట్టి, కృష్ణయ్యశెట్టి, గంగవరం సత్యనారాయణ, వీరశైవలింగాయత్ నాయకులు వీరశేఖర్, వీరన్న, విజయకుమార్ పాల్గొన్నారు.

## ఆటో, ట్రాక్టర్ ఢీకొని ఆరుగురికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

**నందవరం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని కనకవీడు గ్రాస్‌రోడ్డు వేర్‌హౌస్ దగ్గర సోమవారం ఆటోను ట్రాక్టర్ ఢీకొన్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎమ్మిగనూరు పట్టణం వెంకటాపురానికి చెందిన ఆటో డ్రైవర్ కూలీలను ఎక్కించుకుని నాగలదిన్నె వైపు వెళ్తుండగా నాగలదిన్నె నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఆటోను ఢీకొన్నది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న సుదీర్, రాజు, దినకర్, రాజేష్, పెద్దప్ప, ఏసన్నలకు తీవ్ర గాయాలైయ్యాయి. వెంటనే 108లో గాయపడ్డవారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారి పరిస్థితి విషమం కావడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం

**గోనెగండ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వ్యవసాయ శాఖ మండల అధికారి హేమలత అన్నారు. సోమవారం గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గర రైతు సాధికార సంస్థ, ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం(ఆర్‌వైఎస్ఎస్)ఆధ్వర్యంతో కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలలో నాణ్యత ఉంటుందని, ఎక్కువ కాలం మన్నిక వస్తాయని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జీలు రాముడు, మల్లికార్జున ఐసీఆర్‌పీస్ మోహన్, సావిత్రి, ఉదయ్, అయ్యన్న, చిన్నరాముడు, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

## ఆలయ గోపుర నిర్మాణానికి ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప

**కౌతాళం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ దేవత దేవమ్మవ్వ ఆలయ గోపుర నిర్మాణానికి సోమవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదిచాగి గ్రామంలో దేవమ్మ దేవాలయం గోపుర నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామ పెద్దలు తెలుపగా తన వంతు సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌతాళం సాగునీటి సంఘం అధ్యక్షుడు డింగి రఘరాం, టీడీపీ నాయకులు రాజబాబు, సిద్దు, అమోగ్ ఉన్నారు.

# అభివృద్ధే ధ్యేయంగా ముందడుగు

● రూ.40లక్షలతో సీసీ రోడ్డు ప్రారంభం
● నాలుగు కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


బస్సును నడుపుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**ఎమ్మిగనూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కలుగొట్ల రోడ్డు ఎంబీ చర్చి దగ్గర రూ.40లక్షలతో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే స్థానిక ఆర్టీసీ డిపోకు కొత్తగా మంజూరైన నాలుగు సెమీ లగ్జరీ బస్సులకు ప్రత్యేక పూజలు చేసి జనసేనా ఇన్‌చార్జి రేఖాగౌడ, బీజేపీ నాయకులు నరసింహులతో కలిసి ప్రారంభించారు. అలాగే బస్సు ఎక్కి కొంతదూరం నడిపి ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రహదారులన్ని గుంతలమయంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవడంతో పాటు కొత్తగా రూ.2కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు.. అలాగే పట్టణంలోని ప్రధాన రహదారులను సెంటర్ లైటింగ్ సిస్టమ్‌తో వెలుగులు నింపుతున్నామన్నారు. ఇక ఆర్టీసి ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను మంజూరు చేయించామన్నారు. ఇప్పటి వరకు ఎమ్మిగనూరు డిపోకు 17 కొత్త బస్సులు వచ్చాయన్నారు. ఎమ్మిగనూరు-కర్నూలుకు పల్లె వెలుగు బస్సులను కూడా మంజూరు చేయించడం జరిగిందన్నారు. మరో 16 బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అమర్‌నాథ్, టీడీపీ నాయకులు మిఠాయి నరసింహులు, ముల్లా ఖలీముల్లా, సుందర్‌రాజు, అల్తాఫ్, కొండన్నగౌడు, దేవదాసు, వాహిద్, రాళ్లదొడ్డి మురళీకృష్ణారెడ్డి, రంగస్వామిగౌడు, మాచాపురం కాశింవలి, బచ్చాల రంగన్న, గాజుల సుధాకర్, మల్లయ్య, కె.టి వెంకటేశ్వర్లు, రామకృష్ణ నాయుడు, షాలేమ్ పాల్గొన్నారు.

## కులవృత్తులదారులను ఆదుకోండి

**కోసిగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** చేతి కులవృత్తులతో జీవనం సాగిస్తున్న కుమ్మరి వృత్తులదారులను ఆదుకోవాలని కుమ్మర్లు తిక్కన్న, తిక్కస్వామి, కోసిగయ్య, నాగేష్, ఈరన్న కోరారు. సోమవారం కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ నిత్యానంద రాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి కులస్థులు బసవరాజు, ఉమేష్, నాగరాజు, లక్ష్మయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీకి ఘన నివాళి

**పెద్దకడుబూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మాజీ ఎంపీపీ హను మంతు రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, హనుమంతు రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు రమాకాంత్ రెడ్డి, బసల దొడ్డి ఈరన్న, యోసేపు, రామిరెడ్డి, ముత్త రెడ్డి, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## పార్లపల్లి పాఠశాలలో డిప్యూటీ డీఈవో విచారణ

**ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు మండల పరిధిలోని పార్లపల్లి గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈవో వెంకట రామిరెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. నాలుగు రోజుల క్రితం పాఠశాలలో 8వ తరగతి చదువు తున్న ఓ విద్యార్థినిని పాఠశాలకు వెళ్లిన ఎంఈవో-2 మధుసూదన్‌రాజు కొట్టారన్న విమర్శలు వచ్చాయి. ఈవిషయంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టడంతో డీఈవో ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈవో వెంకట రామిరెడ్డి, ఎంఈవో-1 ఆంజనేయులును విచారించారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు.

## న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

● మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు
● పన్నెండవ రోజుకు చేరిన సమ్మె


సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

**ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు చేపట్టిన సమ్మె సోమవారానికి పన్నెండవ రోజుకు చేరింది. పట్టణంలో ర్యాలీ నిర్వహించి మున్సి పల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ .26వేలు ఇవ్వాలని, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించా లని అన్నారు. వీరి సమ్మెతో పట్టణంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. కార్యక్ర మంలో విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి: సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

**కోసిగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** కోసిగి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, అలాగే గర్భిణులకు స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మూకప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ కోసిగి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి పేరుకు మాత్రమే ఉందని, సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. కనీసం రోగులు కూర్చునేందుకు కుర్చీలు లేవన్నారు. కనీసం తాగునీరు కూడా లేదన్నారు. గర్భిణులకు బెడ్లు సరిగ్గా లేవన్నారు. రాత్రి సమయాల్లో అత్యవసర కేసులు వస్తే వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, 30 కి.మీల దూరంలో ఉన్న ఆదోనికి వెళ్లాల్సి వస్తుందన్నారు. రాత్రి సమయంలో కూడా ఆసుపత్రిలో డాక్టర్‌ను ఉండేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. అలాగే బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి ఓంకార్, ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు దివాకర్, నాయకులు మహదేవ్, రమేష్ పాల్గొన్నారు.

## 'ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు'

**గోనెగండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):** స్వార్థరాజకీయకు విలువ నిచ్చి వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వ రరెడ్డిని విమర్శించే అర్హత లేదని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఎన్వీ రామాంజినేయులు అన్నారు. సోమవారం సాయంత్రం గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటే శ్వర్లు, బాబు నాయుడు, మదీనాతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగుసార్లు ఎమ్మెల్యే గెలుపొందిన చెన్నకేశవ రెడ్డి నియోజకవర్గంలో చెప్పుకోదగ్గస్థాయిలో ఏ పని చేశారో ప్రజలకు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అభివృద్ధికి బాటలు వేసే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని విమర్శిస్తే ప్రజలు సహించరన్నారు. ఈ సమావేశంలో నాయుడు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

## కుక్కల దాడిలో గొర్రెలు, పొట్టేళ్లు మృతి

రూ.2 లక్షల నష్టం


మృతి చెందిన గొర్రెలు, పొట్టేళ్లు

**కోసిగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని పల్లెపాడు గ్రామానికి చెందిన రైతు దేవిరెడ్డి తిమ్మారెడ్డికి చెందిన తొమ్మిది గొర్రెలు, పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు తిమ్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ చివర సొంత పొలంలో షెడ్డు ఏర్పాటు చేసుకుని గొర్రెలు, పొట్టేళ్లను మేపుతున్నట్లు తెలిపారు. ఆదివారం రాత్రి తాను ఇంటికి రావడంతో సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చూసేసరికి కుక్కల దాడిలో చెల్లాచెదురుగా గొర్రెలు, పొట్టేళ్లు మృతి చెందాయన్నారు. రూ.2లక్షల నష్టం వాటిల్లిందని రైతు కన్నీరుమున్నీరయ్యాడు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.